# నేటి నిజం
తెలుగు దినపత్రిక


నమ్మలేని నిజాలు

ఆరుద్ర కార్తె
పచ్చిక పై ముత్యాలు
ఇంద్రశలభం.

వాన మొరలు
భజనలు యాగాలు
జనం భరోసా.

చేనేత అన్న
సచివుకన్న మిన్న
సమతా దృష్టి.

కప్పల పెళ్ళి
వాన వాన రావయ్య
పల్లె నమ్మకం

ఆరోగ్య భాగ్యం
కోటిశ్వాసల జీవం
యోగ సాదన.



- రేడియమ్
సెల్: 9291527757


website:www.netinijam.com
ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433
E-mail:netinijam93@gmail.com


ప్రశ్నిజాలు

డబ్బు నగలు దాచినట్టు
బ్యాంకుల్లో దాయం !
కన్ను మూసి తెరిచెలోపు
పంట భూమి మాయం !
కనిపించిన భూమినంత
కాజేసే బకాసురులు !
కాళ్ళ కింద జాగ కూడ
లాగేసే నిశాచరులు !.



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245


హైదరాబాద్ గురువారం 13-8-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:8 పేజీలు:6 వెల: రూ.1/-


## పార్లమెంట్‌లో చర్చకు నేను సిద్ధం: అమిత్‌షా

న్యూఢిల్లీ, ఆగష్టు 12: పార్లమెంట్‌లో చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తానన్నారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలనుంచి గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు.. 24 గంటల పాటు ప్రతిపక్షాలు ప్రశ్నలు అడగడానికి అందుబాటులో ఉంటానని చెప్పారు. చర్చ జరపాలని ప్రతిపక్షాలు అధికారికంగా లేఖ రాస్తే.. చర్చ జరపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు.

బుధవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో అమిత్ షా మీడియాతో మాట్లాడుతూ.. 'సమావేశాలు మొదలైన నాటినుంచి పార్లమెంట్‌కు వస్తున్నాను. నా ఛాంబర్‌లో కూర్చుంటున్నాను. పార్లమెంట్ కార్యక్రమాలు సజావుగా జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటుంటే.. ఎవరైనా ఏం చేస్తారు?. వాళ్లు చర్చ జరగడానికి అంగీకరించరు. దీన్ని బట్టి ఎవరు పారిపోతున్నారో ప్రజలే అర్థం చేసుకుంటారు' అని అన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలకు రాహుల్‌గాంధీ కౌంటర్

అమిత్‌షా వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాపై ప్రశ్నల వర్షం కురిపించారు. 'విద్యార్థులపై లాఠీచార్జ్ ఎవరు చేశారు?. కాల్పులకు ఆదేశించింది ఎవరు?. 20 రోజులుగా అమిత్‌షా ఎందుకు మాట్లాడలేదు?. పార్లమెంట్ ముగిసే సమయానికి అమిత్‌షా డ్రామాలు ఆడుతున్నారు' అంటూ రాహుల్ మండిపడ్డారు.

## చార్‌ధామ్‌కు పోటెత్తిన భక్తులు.. 114 రోజుల్లోనే 47 లక్షల మంది



న్యూఢిల్లీ, ఆగష్టు 12: ఉత్తరాఖండ్ లో చార్‌ధామ్ యాత్ర కు భక్తులు పోటెత్తుతున్నారు. వర్షాకాలం కారణంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ యాత్రికుల సంఖ్య రికార్డు స్థాయిలో నమోదవుతోంది. ఈ యాత్రా సీజన్ ప్రారంభమైన 114 రోజుల్లోనే మొత్తం 47,02,703 మంది భక్తులు పవిత్ర పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నారు. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 4,68,556 అధికం కావడం విశేషం. ఈ ఏడాది యాత్ర సరికొత్త రికార్డును నెలకొల్పే దిశగా సాగుతోంది.

భక్తుల భద్రతే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి స్పష్టంచేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ యాత్ర సజావుగా సాగేలా అన్ని సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే తక్షణమే సహాయక చర్యలు చేపట్టేందుకు విపత్తు నిర్వహణ బృందాలు 24 గంటలూ సిద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర విపత్తు నియంత్రణ గది నుంచి ఆయన స్వయంగా పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.

వాతావరణం అనుకూలించనప్పుడు ప్రభుత్వం యాత్రికుల కదలికలను నియంత్రిస్తూ, యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నది. సోమవారం వాతావరణం అనుకూలించకపోయినా 15,376 మంది భక్తులు చార్‌ధామ్‌ను సందర్శించారు. ఈ యాత్రలో భాగంగా బద్రీనాథ్ క్షేత్రానికి అత్యధికంగా 16,12,112 మంది భక్తులు తరలివచ్చారు. ఆ తర్వాత కేదార్‌నాథ్‌ను 14,50,116 మంది, గంగోత్రిని 7,37,629 మంది, యమునోత్రిని 6,62,347 మంది దర్శించుకున్నారు. వీరే కాకుండా హేమకుండ్ సాహిబ్‌ను 2,40,499 మంది భక్తులు సందర్శించారు.గత ఏడాదితో పోలిస్తే ఒక్క బద్రీనాథ్‌లోనే 3.5 లక్షల మందికిపైగా అదనపు యాత్రికులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. గంగోత్రి, యమునోత్రి ఆలయాల ద్వారాలను ఏప్రిల్ 19న తెరవడంతో ఈ ఏడాది చార్‌ధామ్ యాత్ర ప్రారంభమైంది. ఏప్రిల్ 23న బద్రీనాథ్ ఆలయాన్ని తెరిచారు. హిందూమతంలో అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాలైన యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లను కలిపి ఛోటా చార్‌ధామ్‌గా పిలుస్తారు. 8వ శతాబ్దంలో ఆది శంకరాచార్యులు దేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఐక్యతను బలోపేతం చేసేందుకు ఈ యాత్రా సంప్రదాయాన్ని ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారు.

## హైదరాబాద్‌లో ఏఐ హబ్-స్విట్జర్లాండ్ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించిన కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 12 : ప్రముఖ గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నాలెడ్జ్ అండ్ కంప్లయన్స్ ప్లాట్‌ఫారమ్ 'ఏఐ హబ్ స్విట్జర్లాండ్' తన పూర్తిస్థాయి డిజిటల్ ఎకోసిస్టమ్‌ను అధికారికంగా ప్రారంభించింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ చారిత్రక లాంచ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా దేశ ప్రముఖ ఐటీ లీడర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు విచ్చేశారు. ప్లాట్‌ఫారమ్ ఫౌండర్ శ్రీధర్ గందెతోపాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాంకేతిక రంగంలో విస్తృతంగా ఉన్న సమాచార లోడ్‌ను (ఇన్ఫర్మేషన్ ఓవర్‌లోడ్) ఎదుర్కొనేందుకు 'ఏఐ హబ్ స్విట్జర్లాండ్' ఒక సమగ్ర ఏఐ రెఫరెన్స్ లేయర్‌గా పనిచేస్తుంది. కేవలం ఒక స్టాటిక్ డైరెక్టరీలా కాకుండా, ఇది 15 విభాగాల్లో 125కి పైగా వెరిఫైడ్ ఏఐ టూల్స్, రుజువైన ఆర్‌ఓఐ మెట్రిక్స్‌తో కూడిన 50కి పైగా ఎంటర్‌ప్రైజ్ కేస్ స్టడీలు, ఈయూ ఏఐ యాక్ట్, ఎన్ఐఎస్‌టీ ప్రమాణాలతో సహా 23కి పైగా గ్లోబల్ గవర్నెన్స్ ఫ్రేమ్‌వర్క్‌లను ఒకే వేదికపైకి తెస్తోంది.

**గ్లోబల్ థింక్ ట్యాంక్‌గా రూపాంతరం: పరిశోధకులు, నిపుణుల భాగస్వామ్యం**

అధికారిక రిఫరెన్స్ వేదికగా తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకునేందుకు 'ఏఐ హబ్ స్విట్జర్లాండ్' గ్లోబల్ ఏఐ థింక్ ట్యాంక్‌గా విస్తరిస్తోంది. ఈ ఇనిషియేటివ్ కింది అంశాలపై దృష్టి సారిస్తుంది.

గ్లోబల్ కంట్రిబ్యూటర్ నెట్‌వర్క్: పీర్-రివ్యూడ్ బెంచ్‌మార్క్‌లు, వైట్‌పేపర్లు, టెక్నికల్ ఎవల్యూయేషన్‌లను ప్రచురించడానికి అగ్రశ్రేణి ఏఐ పరిశోధకులు, డేటా సైంటిస్టులు, ఇంజనీర్లను ఆహ్వానిస్తోంది.

ప్రాక్టీషనర్ ఇన్నోవేషన్ పాడ్స్: హెల్త్ కేర్, ఫిన్‌టెక్, ఎంటర్‌ప్రైజ్ ఆటోమేషన్ రంగాల్లో ప్రత్యేక వర్కింగ్ గ్రూప్‌లను ఏర్పాటు చేయడం ద్వారా సిద్ధాంతాలను ఆచరణలోకి తెచ్చే ఓపెన్-యాక్సెస్ ప్లేబుక్‌లను రూపొందిస్తుంది.

థాట్ లీడర్‌షిప్ డైలాగ్స్: సాంకేతిక పురోగతులు, ఆచరణాత్మక ఎంటర్‌ప్రైజ్ అమలు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చేందుకు రౌండ్‌టేబుల్ సమావేశాలు, హైబ్రిడ్ వేదికలను నిర్వహిస్తుంది.

### చురక

అబద్ధాల కాలుష్యం
అంతా రాజకీయం
చక్కర్లతో సమాజాన్ని
చేసే వింత గాయం.
అధికారం ప్రతిపక్షం
అతీతం ఎవరు కారు
పరస్పరం తిట్టుకుంటే
పవిత్రం అయిపోరు



-వేల్పుల నారాయణ
9440433475


### రాధశ్రీ రాగాలు

రాజరాజేశ్వరుడు
నీలకంఠేశ్వరుడు
ధర్మమును కాపాడు
నను రాధశ్రీ !!
రామలింగేశ్వరుడు
సిద్ధ రామేశ్వరుడు
ఇష్టకామ్యములనిడు
నను రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210

## ఆత్మకథలను చదవండి.. యువతను కోరిన ప్రధాని మోదీ




న్యూఢిల్లీ, ఆగష్టు 12: ఆత్మకథ పుస్తకాలను యువత చదవాలని, ఇతరుల కష్టాల నుంచి వారు నేర్చుకోవాలని ప్రధాని మోదీ అన్నారు. ఇది రీల్స్ యుగం అని, కానీ కేవలం షార్ట్‌కట్‌లు నేర్చుకుంటే, జీవితం షార్ట్ అవుతుందని కూడా ఆయన హెచ్చరించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆటోబయోగ్రఫీ 'ట్రింఫ్ ఆఫ్ ద ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' అనే బుక్‌ను ఇవాళ ప్రధాని మోదీ ఆవిష్కరించారు. ఆ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కోవింద్ జీవితం పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. కోవింద్ పట్టుదలతో చదివి, రాజ్యాంగ హోదాలో అత్యున్నత స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. రాష్ట్రపతి పదవి నుంచి వైదొలిగిన తర్వాత కూడా కోవింద్ ప్రజా జీవితంలో చురుకుగా ఉంటున్నారని, ఆఫీసు నుంచి తప్పుకున్న తర్వాత ఆయనేమీ రెస్టు తీసుకోలేదని, వన్ నేషన్.. వన్ ఎలక్షన్ స్కీమ్‌పై ఆయన వర్క్ చేస్తున్నట్లు ప్రధాని చెప్పారు.

భారత ప్రజాస్వామ్యంలో ఆయన చేస్తున్న కృషి కొత్త అధ్యాయాన్ని లిఖించనున్నదని ప్రధాని తెలిపారు. భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కోవింద్ నిరంతరం శ్రమిస్తున్నట్లు చెప్పారు. ఆత్మకథలను చదువుకోవాలని ప్రధాని మోదీ యువతను కోరారు. ఆ కథల్లో ఆనాటి వాస్తవిక పరిస్థితులు ఉంటాయని, ఇది జీవితానికి అనుభవంగా నిలుస్తుందన్నారు. ప్రస్తుతం రీల్స్ యుగం నడుస్తోందని, సోషల్ మీడియా ప్రచారకర్తలు మిమ్మల్ని ఎక్కడికో తీసుకెళ్లారని, షార్ట్‌కట్‌తో వెళ్తే జీవితం షార్ట్ అవుతుందని ఆయన అన్నారు. కోవింద్ ఆటోబయోగ్రఫీ భారత ప్రజాస్వామ్యానికి వారసత్వంగా మారుతుందని, కొత్త తరం యువత ఆ ఆత్మకథ నుంచి ఎంతో నేర్చుకోవచ్చు అన్నారు.

కోవింద్ లాంటి యువత రాబోయే తరాలకు అవసరం అని, పరిస్థితులను చూసి భయపడడం కాదు, పట్టుదలతో సవాళ్లను ఎదుర్కోవాలన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌కు మార్గం వేయాలని, కోవింద్ ఆటోబయోగ్రఫీ యువతకు ప్రేరణ ఇస్తుందని మోదీ అన్నారు. వ్యక్తిగత జీవితంలో కోవింద్ ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని, కానీ ఆయన సాధించిన విజయం భారత ప్రజాస్వామ్యానికి దక్కుతుందన్నారు.

## మేడ్చల్ కోల్డ్ రష్ లాజిస్టిక్స్ గోదాంలో అగ్నిప్రమాదం.. ఎగిసిపడుతున్న మంటలు

మేడ్చల్, ఆగస్టు 12: దేవరాయాంజాల్‌లో కోల్డ్ రష్ లాజిస్టిక్స్ గోదాంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసేందుకు యత్నిస్తున్నారు. దాదాపు పది ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే అంతకంతకూ పెద్ద ఎత్తున్న మంటలు చెలరేగడంతో.. వాటిని ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు.

అయితే అగ్నిప్రమాదంతో దట్టమైన పొగలు అలుముకోవడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ఘటనాస్థలానికి డీఆర్ఎఫ్, ఫైర్, పోలీస్ మున్సిపల్ సిబ్బంది భారీగా మోహరించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగిందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు

## టాటా సన్స్ చైర్మన్ పదవికి ఎన్ చంద్రశేఖరన్ రాజీనామా

న్యూఢిల్లీ, ఆగస్టు 12: టాటా సన్స్ చైర్మన్ పదవికి ఎన్ చంద్రశేఖరన్ రాజీనామా చేశారు. ఈ సంస్థ చైర్మన్ పదవిని తాను మరోసారి కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. ఆగస్టు 18వ తేదీన ఆ సంస్థ సర్వసభ్య సమావేశం జరగనుంది. అందుకు కొద్ది రోజుల ముందు చంద్రశేఖరన్ రాజీనామా చేయడం ప్రాముఖ్యత సంతరించుకుంది. టాటా గ్రూప్‌లో తాను 40 ఏళ్ల పాటు వృత్తి జీవితాన్ని పూర్తి చేసుకున్నానని తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక సంస్థకు సేవలందించడం ద్వారా సంతృప్తికరమైన అవకాశం లభించిందన్నారు. అందుకు కృతజ్ఞతలు తెలిపారు.

గత దశాబ్ద కాలంగా టాటా సన్స్‌కు నాయకత్వం వహించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఇది అపారమైన బాధ్యత అని అభివర్ణించారు. వారసత్వంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా టాటా బోర్డుకు ఆయన విజ్ఞప్తి చేశారు. 2027, ఫిబ్రవరి 20వ తేదీ వరకు ఆయన పదవి కాలం ఉంది. కానీ కొన్ని నెలల ముందే చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాతో టాటా సంస్థ షేర్లు దాదాపు 5 శాతం మేర పడిపోయాయి.

గతంలో చంద్రశేఖరన్ టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్‌గా పని చేశారు. 2017లో టాటా సన్స్ చైర్మన్‌గా చంద్రశేఖరన్ నియమితులయ్యారు. నాటి నుంచి ఆయన అదే పదవిలో కొనసాగుతున్నారు. అయితే ఈ సంస్థ చైర్మన్‌గా చంద్రశేఖరన్‌ను మళ్లీ నియమించడంపై టాటా సన్స్, టాటా ట్రస్ట్ మధ్య వివాదం నెలకొన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామా చేశారని తెలుస్తోంది.

టాటా గ్రూప్ సంస్థలో స్టీల్, మోటర్స్, టీసీఎస్, ఇండియన్ హోటల్స్ ఉన్నాయి. ఎన్ చంద్రశేఖరన్ ఇప్పటి వరకు వీటికి చైర్మన్‌గా వ్యవహరించారు.

## ఉక్రెయిన్‌తో వివాదం.. రష్యా తరపు మధ్యవర్తిగా మాజీ సీజేఐ చంద్రచూడ్

న్యూఢిల్లీ, ఆగష్టు 12: రష్యా-ఉక్రెయిన్ మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్ కు చెందిన ప్రభుత్వరంగ బ్యాంకు 'ఓస్చాడ్‌బ్యాంక్ ' తో నెలకొన్న పెట్టుబడుల వివాదంలో రష్యా తమ తరపు మధ్యవర్తి గా భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌ను నియమించింది. ఈ వివాదంపై 1998లో రష్యా, ఉక్రెయిన్ మధ్య కుదిరిన ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందం కింద విచారణ జరుగుతోంది.

రష్యా సైనిక చర్యల కారణంగా డొనెట్స్క్, లుహాన్స్క్, ఖేర్సన్, జపోరిఝియా ప్రాంతాల్లో తమ ఆస్తులకు, కార్యకలాపాలకు భారీ నష్టం వాటిల్లిందని ఆరోపిస్తూ ఓస్చాడ్‌బ్యాంక్ ఈ కేసు దాఖలు చేసింది. ముఖ్యంగా 2022 తర్వాత జరిగిన పరిణామాలతో వందల మిలియన్ డాలర్ల నష్టం జరిగిందని పరిహారం కోరుతోంది. ఈ మేరకు 2025 జూలైలో వివాద పరిష్కారం కోసం రష్యాకు నోటీసులు పంపినా స్పందన రాకపోవడంతో అంతర్జాతీయ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది.

ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. ఇరుపక్షాల అంగీకారంతో కోస్టారికాకు చెందిన డయాలా జిమెనెజ్ ధర్మాసనానికి అధ్యక్షత వహిస్తున్నారు. ఉక్రెయిన్ బ్యాంకు తరఫున గ్రీక్ ఆర్బిట్రేటర్ స్టావ్రోస్ బ్రెకౌలాకిస్‌ను నియమించారు. ఇప్పుడు రష్యా తమ ప్రతినిధిగా జస్టిస్ చంద్రచూడ్‌ను ఎంపిక చేసింది. గతంలో ఇలాంటి ఇతర వివాదాల్లో రష్యా చేసిన విజ్ఞప్తులను జస్టిస్ చంద్రచూడ్ తిరస్కరించడం గమనార్హం. అయితే ఈసారి ఆయన నియామకాన్ని అంగీకరించడంతో ఈ కేసుకు ప్రాధాన్యత ఏర్పడింది.

## బీఆర్ఎస్ హయాంలో నీటి వాటాల్లో తెలంగాణకు నష్టం: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఆగస్టు 12: తెలంగాణ నీటి వాటా విషయంలో ఎక్కడా రాజీ పడబోమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. నీటి వాటాల్లో తెలంగాణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందని విమర్శించారు. బుధవారం గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరవుతామని తెలిపారు. నీటి వాటాపై బలంగా కొట్లాడుతామని పేర్కొన్నారు. అసత్యాలతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై మండిపడ్డారు.

కేసీఆర్ ఫాం హౌస్‌లో పండిన వరికి వచ్చిన ధర ఎంతో చెప్పాలంటూ కేటీఆర్‌ను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. తాము కోటిన్నర రూపాయిలకు ఇచ్చిన భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 90 లక్షలకే ఇచ్చిందని గుర్తు చేశారు. నిబంధనల మేరకే భూ కేటాయింపులు జరిగాయని ఆయన వివరించారు. 5 ఎకరాల భూమిని రూ. 7.5 కోట్లకు ఇచ్చామని చెప్పారు. కేటీఆర్ చెబుతున్న రూ. 200 కోట్లు ఎక్కడివో చెప్పాలని నిలదీశారు.

హిల్ట్ పాలసీ వల్ల హైదరాబాద్ ప్రజలకు మేలు జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పారిశ్రామిక వేత్తలను భయపెట్టడం కేటీఆర్‌కు మంచిది కాదని అన్నారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరైనది కాదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడికి హితవు పలికారు. తమపై ఉన్న కోపాన్ని తెలంగాణ ప్రజలపై చూపవద్దని ఆయనకు సూచించారు. బీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు నమ్మలేద పేర్కొన్నారు. అందుకే ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించారని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

## రైతు పొలంలో పురుగు మందు స్ప్రే.. 14 మంది కూలీలకు అస్వస్థత

### - కొత్తగూడెం ఆస్పత్రిలో చికిత్స

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 12 : భద్రాద్రి కొత్తగూడెం సుజాతనగర్ మండలంలో 14 మంది కూలీలు అస్వస్థకు గురయ్యారు. రెండు రోజుల క్రితం సుజాతనగర్ మండలం కొత్త అంజినాపురంలో నర్రా అజయ్ పంట పొలంలో 20 మంది కూలీలు పనులు చేస్తున్నారు. పనులు చేసే క్రమంలో పొలం యజమాని మొక్కలకు పురుగుమందు స్ప్రే చేశాడు. స్ప్రే చేసిన సమయంలో కలుపు తీస్తుండగా వారికి పురుగుమందు స్ప్రే కండ్లు, ముక్కుల్లో పడడతో ఆ వాసనకు వారు అస్వస్థకు గురయ్యారు. ఇంటికి వెళ్లిన తర్వాత వారికి వాంతులు, విరోచనాలు కావడంతో గమనించిన కుటుంబ సభ్యులు వారిని కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి బుధవారం తీసుకువచ్చారు. ప్రస్తుతం వారంతా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండడంతో ఆస్పత్రి వైద్యులు ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. మిగతా 12 మంది పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## ఇండియా-చైనా మధ్య మళ్లీ ఉద్రిక్తత.. భారత, చైనా బలగాల మధ్య అరుణాచల్ ప్రదేశ్‌లో ఘర్షణ

న్యూఢిల్లీ, ఆగష్టు 12: ఇండియా- చైనాల మధ్య మరోసారి ఉద్రిక్త వాతావర ణం ఏర్పడింది. ఇరు దేశాల సైనికులు సరిహద్దులో పరస్పరం ఘర్షణకు దిగినట్లు తెలుస్తోంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని భారత సరిహద్దు ప్రాంతం లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (ఎల్ఏసీ) వద్ద గత నెలలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన ఒక ఫొటో ప్రస్తుతం వైరల్‌గా మారింది. దీనిపై భారత సైన్యం, ప్రభుత్వం మాత్రం అధికారికంగా స్పందించలేదు. జూలై 26న ఈ ఘటన జరిగింది. ఇండియా, చైనా బలగాలు సరిహద్దులు సాధారణ ప్యాట్రోలింగ్ నిర్వహిస్తుండగా పరస్పరం ఎదురుపడ్డారు.

అయితే, అక్కడ చైనా సైనికులు ఇంగ్లీషులో ఒక బ్యానర్ ప్రదర్శించడం ఘర్షణకు దారితీసింది. ఇలా వారం రోజులపాటు ఇరు దేశాల సైనికులు ఘర్షణకు దిగినట్లు సమాచారం. తర్వాత రెండు దేశాలక చెందిన ఆర్మీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, పరస్పరం చర్చలు జరిపారు. పరిస్థితి సద్దుమణిగేలా చేశారు. ప్రస్తుతం ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు లేనట్లు తెలుస్తోంది. గతంలో కూడా పలుమార్లు ఇరు దేశాల సైనికులు ఘర్షణకు దిగిన సంగతి తెలిసిందే. 2017లో డోక్లాం సెక్టార్‌లో ఘర్షణ జరిగింది. ఆ తర్వాత చివరిసారిగా 2020 జూన్‌లో లదాఖ్ వద్ద ఇండియా-చైనా సైనికుల మధ్య తీవ్ర ఘర్షణ తలెత్తిన సంగతి తెలిసిందే. అప్పటి ఘర్షణలో 20 మంది భారత సైనికులు అమరులయ్యారు. చైనా సైనికులు కూడా బోలెడంత మంది మరణించారు. కానీ, దీనిపై చైనా అధికారికంగా ప్రకటించలేదు.

మళ్లీ ఆరు సంవత్సరాల తర్వాత రెండు దేశాల మధ్య ఘర్షణ తలెత్తింది. మరోవైపు చైనా ఇటీవలి కాలంలో ఇండియాను రెచ్చగొట్టే చర్యలకు దిగుతోంది. అరుణాచల్ ప్రదేశ్‌ను తన భూభాగంగా పేర్కొంటూ చైనా మ్యాప్ కూడా రూపొందించింది. అంతేకాదు.. ఇక్కడి ప్రదేశాలకు కొత్త పేర్లు పెట్టింది. కానీ, ఇండియా వీటిని ఖండించింది. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ ఇండియాలో భాగమే అంటూ ప్రకటించింది. రెండు రోజులక్రితం కూడా ఇండియా ఇదే విషయాన్ని మరోసారి స్పష్టం చేసింది.




నేటి నిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com

## సప్త పదులు

ప్రక్రియా సృజనకర్త: సుధామ



కలవరం
వివరం

మరణం
ఎప్పుడో
తెలియక పోవడమే
వరం....!!

-శ్రీమతి భారతీకృష్ణ
హైదరాబాద్

యోగాలు
భోగాలు

సరైన
జీవన
విధానంతో
రావు రోగాలు .

-మా. శ్రీ. రాజు
పాల్వంచ

తలచినా
వగచినా

జ్ఞాపకాలే
మిగిలేను
మదిలో
ప్రాణంగా నిలిచినా

-సరోజ రెబ్బాప్రగడ
9663306023

తలపించు
వలపించు

తేనెలు
చిందించు
తీయని మాటలు
మురిపించు..

-పద్మావతి పి.
హైదరాబాద్

బొద్దింక
వద్దింక
దేశాన్ని కుదిపే
సంఘటనలు
అనేవి
రావద్దింక

-అచ్యుతుని రాజ్యశ్రీ
హైదరాబాదు


పొంగు
కుంగు
పరిస్థితులు
ఏవైనా
మార్చుకు
అసలు రంగు

-కామేశ్వరి వాడ్రేవు
హైదరాబాద్



# పేగుముడి శబ్దాలను నమోదు చేసిన కథలు"

పుస్తక సమీక్ష



ప్రతులకు:
పర్కపెల్లి యాదగిరి
సెల్:92999 09516



తెలంగాణ కథ అస్తిత్వాన్ని పరిరక్షించే క్రమంలో శ్రమిస్తున్న కథారచయితల జాబితాలో తన పేరును కూడా నమోదు చేసుకున్న రచయిత పర్కపల్లి యాదగిరి. ఈయన కలంనుంచి ఇప్పటికి 75 కి పైగా కథలు ప్రాణం పోసుకుని అటు పాఠకుల మెప్పును, ఇటు బహు మతుల వంటను సంతృప్తిగానే తన ఖాతా లో చేర్చుకున్నాయి. ఆ వరుసలో తలుపు తీసుకొని తెలంగాణ మాండలికంలో పలకరిస్తున్న యాదగిరి కథాసంపుటి 'పొలిమేర దాటే వేళ. కాలపరీక్షలో నిటారుగా నిలబడి ధాటిగా తన సత్తాను చూపుతున్న కథల సమాహారం ఈ కథా సంపుటి. ఇందులోని కథల నిర్మాణంలో తెలంగాణ మాండలికం ప్రధాన పాత్ర పోషించింది. అదొక భాషగా మాత్రమే కాకుండా, మనిషి మానసిక భావాలను ధాటిగా మాటలలోనికి తర్జుమా చేయగలశక్తి తన దగ్గర అపారంగా వుందని మరోసారి నిరూపించిన సందర్భమిది. ఈ భాష జీవితానానుభవాలకు ప్రతీకగా వుండి, భావవ్యక్తీకరణలో తనకు మాత్రమే సొంతమైన సజీవ జీవన వ్యాకరణాన్ని సంపూర్ణంగా ప్రదర్శించుకున్న వేదిక ఈ కథల సంపుటి.

ఇందులో శాశ్వతంగా తమ స్థావరాలను నిర్మించుకున్న 12 కథలు, కథా సాహిత్యానికి మరో ఉత్తమ శిఖరాలుగా నిలుస్తున్నాయి. కథలకు ఈ రచయిత నిర్దేషించిన శీర్షికలన్నీ కథల మీద పాఠకుల ఆసక్తిని రెట్టింపు చేసేలా వున్నాయి. ఏ శీర్షిక కూడా కథాంశాన్ని వెల్లడిచేసే దిశలో తన తలుపుల్ని తెరవలేదు. 'పాకురు బాట', పాతాళగరిగె', పేగు ముడి'... ఈ శీర్షికలన్నీ సాధారణంగా వినిపించే పేర్లకంటే భిన్నంగా కొత్త ఆలోచనాదారుల్లో పాఠకులను నడవమని ఆజ్ఞాపిస్తున్నాయి. 'పాములు', 'చీమలు'... ఇవి కూడా ఇందులో వున్న కొన్ని కథల పేర్లు. అతిసాధారణంగా వీటి పేర్లు ఉన్నాసరే ఆ కథల కోసం తమ సమయాన్ని సంతృప్తికరంగా కేటాయించుకోటానికి ప్రతి పాఠకుడు సిద్ధపడుతున్నాడు.

ఈ సంపుటిలో కథలు, పాఠకుల్ని రాఘవ ఇంటికి నడిపిస్తున్నాయి, 'నాకు సచ్చిపోవాలని వుంది' అంటూ పేపరు మీద రాసి ఇల్లు దాటివెళ్లిపోతున్న 'హిమాంశు' వెంట పరిగెత్తేలా చేస్తున్నాయి. దాహమేసి నీళ్ల త్రాగుతున్న కాకులను, ఊరపిచ్చుకలను చూసి నిలబడ్డ 'నర్సవ్వ' ముందు నిలబెట్టి ఆమె నవ్వును చూడటానికి అవకాశం కల్పిస్తున్నాయి. ఎన్నో కష్టాలు పడుతున్న 'బతుకమ్మ' సంసారాన్ని గమనించటానికి అందరినీ ఆ ఇంటిముందు హాజరుపరుస్తున్నాయి. పాములకంటే మనుషులకే విషం ఎక్కువంటూ నిరూపించిన 'పాములు' కథలోని సన్నివేశాల ముందు అధ్యాయనం కోసం హాజరుకమ్మని పాఠకులను ఆదేశిస్తున్నాయి. వర్షం కురుస్తోంది. కోరస్ లాగా కప్పలు అరుస్తున్నాయి. గాలులకు తుమ్మచెట్లు ఊగుతున్నాయి. గుడిసెను కప్పిన ప్లాస్టిక్ కాగితాలు పట్ పట్ మంటూ శబ్దాలు చేస్తున్నాయి. సరిగ్గా వాటి మధ్య పాఠకులను నిలబెట్టి 'పాతాళగరిగె' ఘోషను వినిపిస్తున్నాయి. ఈ విధంగా ఈ సంపుటిలోని కథలన్నీ పాఠకులను తమతో కలిసి నడిచే దోస్తులుగా మార్చుకున్న ఓ కొత్తదనం ఈ కథల నిర్మాణంలో ప్రత్యేకంగా కనిపిస్తోంది.

ఒక చక్కటి ప్రామాణిక ప్రాపంచిక ఆలోచనలు కలిగిన రచయిత పర్కపల్లి యాదగిరి. ఆయన అందించిన ఈ కథలన్నీ లోకంలోవున్న తీరుకు అద్దంపడుతున్నాయి. అన్నీ మనచుట్టూ జరుగుతున్న యదార్థ గాథలే. తెలంగాణ జీవనశైలినిండా కనిపిస్తున్న అతిసాధారణ జీవితాల ప్రతిబింబాలే. 'పొలిమేర దాటే వేళ' కథలో వృద్ధాప్యం శాపంగా మారి, ఇంట్లో సొంత మనుషుల ఆదరణ కరువై ఇల్లు వదిలిపోతూ విలవిల్లాడుతున్న రాఘవ తండ్రిని పోలిన వృద్ధులు రోజూ మన కళ్లముందు వందల్లో కనిపిస్తున్నారు. వాళ్లందరి ప్రతిబింబమే ఆ పాత్ర. వృద్ధాప్యంలో వయసు పెరుగుతున్న కొద్దీ ఆ మనుషులకు ఆత్మాభిమానం కూడా పెరుగుతుందన్న సత్యాన్ని గుర్తించేలా ఈ కథలో సన్నివేశాలన్నీ చాలా శక్తివంతంగా అందించబడ్డాయి. నల్లరేగడి రంగులాంటి చర్మం మాటునుండి కండలు కరిగిపోయిన ఆనవాళ్లు శరీరం నుండి తొంగిచూస్తున్న గోవిందు తాతకు ఒక మనవడు, వాడే బుచ్చిగాడు. వీళ్లద్దరి మధ్యనున్న బంధాన్ని కొలవటానికి ఆకాశం కొలతలు చాలటంలేదు. తన కనురెప్పల మధ్య ప్రాణానికంటే ఎక్కువగా మనవడిని కాపాడుకుంటున్నాడు గోవిందు. వాళ్లిద్దరి మధ్య నడిచే ప్రతిమాట మానవసంబంధాల కావ్యానికి ముఖచిత్రంగా నిలుస్తోంది. వాళ్ల చర్చల్లో లోకంతీరు చాలా స్పష్టంగా ఆవిష్కరించబడుతోంది. 'బుగులు పడొద్దు బిడ్డా...యాల్లాకు బువ్వ దినాలే... సదువు మీద మనసు పెట్టాలే...' అంటూ మనవడికి బోధించిన గోవిందు, తెల్లారేసరికి బుచ్చిగాడిని వొంటిరివాడ్ని చేసి లోకం వదిలి వెళ్లిపోతాడు. అతడి ముక్కులోకి నోటిలోకి చెవుల్లోకి చీమల బారు వరుసలు కడుతాయి. ఇదేమి తెలియని బుచ్చిగాడు తాతను కౌగిలించికొని గాఢంగా నిద్రపోతున్నాడు. ఆ ప్రక్కనే నిలబడ్డ పాఠకులు మాత్రం తమ కన్నీళ్లను ఆపుకోలేక దుఃఖిస్తున్న దృశ్యాన్ని కాలం తన పేజీల్లో శ్రద్ధగా రాసుకుంటోంది.

తూర్పు ఆకాశం మందార తోటయి మొగ్గవిచ్చుకుంటున్న వేళ మూసివున్న షట్టర్ అరుగుమీద ఇద్దరు మగపిల్లలు. ఆ పోరాగాండ్ల కన్నీటి కథే 'పిట్టలు'. ఇందులోని కథనరీతి, ఆ కథకు మన అభిరుచిని బానిసల్ని చేస్తుంది. కోడిపిల్లల్లాగా పరిగెత్తే ఈ పిల్లల మనసుల్లో చాలా ఆశలున్నాయి, కోరికలున్నాయి. కానీ నిరాశలన్నీ తీరని శాపాల్లా, వదలనిరుఖడ వొంటిమీద మట్టిలాగా మిగిలిపోయాయి. చివరికి కథ సుఖాంతం కావటానికి కావలసిన సన్నివేశాలను, అందుకు తగిన పాత్రలను రచయిత కల్పించిన విధానం కల్పన నుండి సహజత్వం రంగులోకి దూకినట్లుగా వుంటుంది. దూరంనుంచి వినిపించే బడిగంట శబ్దంతో ప్రారంభమవుతుంది 'పేగుముడి' కథ. ఇందులో సంతానం కరువైన సరోజకు 'సంపతి' గాడు పుట్టాడు. కాని అల్లరి ఎక్కువ. అంతే ఎక్కువగా కరుణ కూడా వాడికి వుంది. కడుపులో పిల్లలున్న పిల్లికి పెరుగు బువ్వ పెట్టమని మారం చేస్తాడు. ఆ పిల్లితో అతని అనుబంధాన్ని అద్భుతం గా చిత్రీకరించాడు రచయిత. పతాక సన్నివేశంలో మానవత్వం పరిమళించిన దృశ్యాన్ని చూసి మన కళ్లు సైతం ఎంతో తడిని మోయటానికి సిద్ధపడుతాయి.

ఈ కథల్లోని ప్రతి పాత్ర, ఒక ఇంటి నిర్మాణంలో వుపయోగపడిన ప్రధాన సామాగ్రిలాగే నమోదు కాబడుతున్నాయి. 'రేణుక' కథలోని రేణుక పాత్ర, ఆ కథకే వెన్నుముకగా నిలుస్తుంది. భర్తను బ్రతికించుకోవటానికి ఆసుపత్రుల చుట్టూ తిరిగి పడిన కష్టాలు వర్ణనాతీతంగా వుంటాయి. ఆమె కష్టపడి భర్తను బ్రతికించుకున్నా, తెల్లారేసరికి ఆమె ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. తన కుటుంబం కోసం ఆమె చేసిన త్యాగం ఒక కన్నీటి బొట్టుగా మారి జాలిపడ్డ మన చూపులనుంచి జారుతోంది. మనిషి నైతికంగా దిగజారిపోయాక అతడు ఉపాధ్యాయుడైనా సరే చేసిన తప్పుకు శిక్ష అనుభవించవలసిందే. ఈ వాదన 'గురు సాక్షాత్ కథలో 'హిమాంశు' పిల్లోడిది. తన తండ్రిలోని నేరతత్వాన్ని గుర్తించిన పాత్రగా చాలాకాలం మనకు గుర్తుండిపోతాడు. 'చీమలు' కథలో మంత్రి కారు వేగంగా వచ్చి 'వీరేశు' చావుకు కారణమయింది. ఆ కుటుంబ దుఃఖాన్ని డబ్బుతో కొనాలనుకుంటాడు మంత్రి. ఇచ్చిన డబ్బును వద్దని వెళ్లిపొమ్మంటాడు రాయమల్లు. చివరికి ఒక రోజు రాయమల్లు రద్దీగావున్న రోడ్డు దాటుతున్నాడు. ఇంతలో ఎరుపురంగు కారు తనవైపుకు దూసుకువచ్చింది. రాయమల్లు ప్రమాదంనుంచి తప్పించుకున్నా, బోల్తాపడిన కారులో వున్న మంత్రి అక్కడికక్కడే ప్రాణం వదులుతాడు. ప్రాణం విలువ తెలియని మంత్రికి రచయిత విధించిన శిక్ష సరైనదేనంటూ చుట్టూవున్న గాలి చప్పట్లు కొడుతోంది. ఇలా చర్చించటానికి ఈ కథల్లో వున్న ప్రతి పాత్ర తమ అర్హత పత్రాలతో మనముందు నిలబడుతున్నాయి.

కథా గమనానికి బలాన్ని చేకూర్చే సందర్భసహిత వర్ణనలు అందించటంలో ఈ రచయిత తన ప్రత్యేక ముద్రను ఈ సంపుటిలో కొనసాగించడం హర్షదాయకంగా వుంది. కథకు అవసరమైన చోట ప్రకృతిని గొప్పగా ఈ రచయిత వర్ణిస్తాడు. 'మసకబారిన అద్దంలాగా మసక చీకటి, పచ్చి తుణికి ఆకు మంటపెడితే ఆకు పొగమారినట్లు చిక్కటి మంచు , ఇప్పుడే పదును పెట్టిన కత్తివలె వాడైన చలి... ఈ మూడింటి కరబంధనాల్లో ఊపిరాడక నేలమ్మ పెనుగులాట....' 'పిట్టలు' కథలో తరువాత వచ్చే సన్నివేశాలకు కావలసిన భూమికను ఈ వర్ణన అందించటం గమనార్హం. 'పాములు', 'పాతాళగరిగె', 'రేణుక' కథల్లో సైతం రచయిత అందించిన ప్రకృతి వర్ణన ఆ కథలకు తప్పనిసరి అంశంగా వొప్పందాల మీద సంతకాలు పెడుతోంది. 'అతని ఒళ్ళు కాలం చెల్లిన ఎడ్లబండిలా తయారయ్యింది' అంటూ 'పోరడు' కథలో బ్రతుకంతా కష్టపడి చితికిపోయిన ముసలాడు గోవిందును మనముందు సజీవంగా నిలబెడుతున్నాడు రచయిత.

కొన్ని కథల్లో అందించిన దృశ్యాలు మన యెదల్లో శాశ్వతంగా గూడు కట్టుకుంటున్నాయి. 'ఆడ ఊరపిచ్చుక నల్లా పిడిని కాళ్ళతో పట్టుకొని వంగి నల్లాలోకి ముక్కు పెట్టింది. మరో ఊరపిచుక పైపు మీద నిలబడి కిచకిచ మంటూ అటూ ఇటూ చూస్తోంది... ఈ సజీవమైన దృశ్యం 'గూడు' కథలో చోటు చేసుకుంది. రచయిత అద్భుత పరిశీలనా దృష్టికి పరాకాష్టగా నిలిచిన దృశ్యమిది. 'బతుకమ్మ' కథ పతాక సన్నివేశంలో బతుకమ్మ స్మశానానికి వెళ్లి, నారాయణ ఖనన స్థలం మీద మొలిసిన పిచ్చిమొక్కల్ని పెరికివేస్తుంది. పెనిమిటి నారాయణతో గడిపిన రోజులన్నీ ఆ క్షణంలో గుర్తుకొచ్చి దుఃఖం ఆపుకోలేక గోడుగోడునా ఏడుస్తుంది. ఆమె గొంతునుంచి వచ్చిన ఆఖరి శబ్దం అదే. ఆ తరువాత ఆమె గొంతు మూగబోయింది. శరీరంలో చలనం శాశ్వతంగా ఆగిపోయింది...' అంటూ కథను ముగిస్తాడు రచయిత. ఈ దృశ్యం మాత్రం పాఠకుడ్ని కొన్ని సంవత్సరాలపాటు వెంటాడుతూనే వుంటుంది. రచయిత పేరు పచ్చబొట్టుగా మిగిలిపోవటానికి కారణమైన కథగా ఇది నిలిచిపోతుంది.

ఈ సంపుటిలోని అన్ని కథలకు సమాజమే ముడిసరుకును అదించినట్లు రచయిత 'నా మాట.,'లో ప్రకటించుకున్నాడు. పీడిత ప్రజలు, వాళ్ల జీవితాల్లో పెనవేసుకుపోయిన కష్టాలు, నష్టాలు, బాధలు, ఏడ్పులు, కన్నీళ్లు, దైన్యంతో నిండిన బ్రతుకులు... ఇవే కథావస్తువులుగా మనల్ని పలకరిస్తున్నాయి. కథలలోని ప్రతి సన్నివేశాన్ని, సందర్భాన్ని, పాత్రల మనస్తత్వాలను, అందుకు తగినట్లు ఆ పాత్రల సంభాషణలను అత్యంత సహజంగా చిత్రీకరించిన విధానం ఎంతో ఎత్తులకు ఈ కథల్ని చేర్చగలిగింది. ప్రజల భాషలో వాళ్ల కష్టనష్టాల తడిని కలం సిరాకు అందించి మంచి కథలను అందిస్తున్న రచయితల జాబితాలో స్థానం సంపాదించుకున్న రచయిత, కవి, చిత్రకారుడు పర్కపల్లి యాదగిరి. కథలకు ఆయన ఎన్నుకునే శీర్షికలు, ఉత్సాహాన్ని కలిగించే ఎత్తుగడలు, కథను చివరిదాకా చదివించగలిగిన నడక, చిరకాలం గుర్తుండిపోయే ముగింపు...ఇలా ఉత్తమ కథకు అవసరమైన సమస్త విషయాలలో సమగ్రమైన అవగాహన కలిగిన ఈ రచయిత కలం తన సత్తాను ఉత్తమ స్థాయిలో ఈ సంపుటి నిండా ప్రదర్శించుకోగలిగింది. ఈ కథలకు ప్రధానమైన ఆయువు కథల్లో చోటుచేసుకున్న తెలంగాణ మాండలికం. ఆ గుండె సవ్వడిని ధాటిగా వినిపించి, మంచి కథా సాహిత్యాన్ని అద్భుతమైన రీతిలో అందించిన పర్కపల్లి యాదగిరికి హృదయపూర్వక అభినందనలు.

-సాహిత్య ప్రపూర్ణ
డాక్టర్ కె.జి. వేణు,
98480 70084



# సిధారెడ్డిది మహోన్నత వ్యక్తిత్వం

-మాజీమంత్రి నిరంజన్ రెడ్డి

అట్టహాసంగా సాహిత్య సమాలోచన వ్యాస సంకలనం గ్రంథావిష్కరణ

హైదరాబాద్, ఆగష్టు 12: వ్యక్తిగత ప్రతిష్టకంటే సమాజ ప్రతిష్ట కోసం జీవనం సాగిస్తున్న డా॥ నందిని సిధారెడ్డిది మహోన్నత వ్యక్తిత్వం అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలుగు భాషా చైతన్య సమితి, మహేంద్రహిల్స్ టీజీఎస్‌డబ్ల్యూఆర్ మహిళా డిగ్రీ కళాశాల సంయుక్తాధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ నందిని సిధారెడ్డి సాహిత్య సమాలోచన (తెలుగు, ఆంగ్లం) వ్యాస సంకలనం గ్రంథావిష్కరణ సభ ఆబిడ్స్ తిలక్ రోడ్డులో గల తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో ఆదివారం జరిగింది.





సభలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి.



ప్రముఖ కవి డాక్టర్ నందిని సిధారెడ్డి సాహిత్య సమాలోచన (తెలుగు,ఆంగ్లం) వ్యాస సంకలనం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి. వేదికపై కందుకూరి శ్రీరాములు, డా॥నాళేశ్వరం శంకరం, బడేసాబ్, డా॥ఏనుగు నరసింహారెడ్డి, ఆచార్య సి. మృణాళిని, భాష్యం అనురాధ, డా॥వి. జయప్రకాశ్, డా॥ నందిని సిధారెడ్డి, డా॥దార్ల వెంకటేశ్వరరావు, కోయి కోటేశ్వరరావు, డాక్టర్ ఎడ్ల కల్లేశ్, ఎల్.జగన్ తదితరులు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగిస్తూ సమాజంలో మార్పు కోసం ఓర్పుతో కృషి చేస్తున్న కవులలో సిధారెడ్డి ఒకరని అన్నారు. కర్తృత్వం, వక్తృత్వం, నేతృత్వం సమన్వయిం చిన కవి సిధారెడ్డి అభినవ పోతన అని నిరంజన్ రెడ్డి అభివర్ణించారు. సాహిత్యతత్వానికి విరుద్ధంగా ఉన్న ప్రభుత్వ పురస్కారాలను తిరస్కరించడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.

భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ప్రసంగిస్తూ.. పేదల పక్షాన నిలిచి రచనలు సాగిస్తున్న సిధారెడ్డి రచనలు చిరస్థాయిగా నిలుస్తాయన్నారు.

డా॥ మృణాళిని మాట్లాడుతూ, వినయం, మిత్రత త్వం, విశాల దృక్పథం కలిగిన సిధారెడ్డి గారు ఎన్ని పదవులు వచ్చినా గర్వం తెలియని వ్యక్తి అని పేర్కొన్నారు. ఏ కవితా ప్రక్రియలోనైనా విశిష్ట వస్తు శిల్పాన్ని సృష్టించగల అరుదైన కవి అని అభివర్ణించారు.

ఆచార్య కొండ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రియలిజం, సరియలిజం, పోస్ట్ మోడర్నిజం ప్రభావాలతో పాటు గుగియాతియాం గో, ఆంటోనియో గ్రామ్షి వంటి ఆలోచనా పరుల ప్రభావం సిధారెడ్డి గారి రచనల్లో ప్రతిఫలించిందని అన్నారు. తెలంగాణ మాండలిక ప్రజాభాషను నిజాయితీగా కవిత్వంలో ప్రతిష్ఠించిన కవి అని కొనియాడారు.

ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, సిధారెడ్డి గారు ప్రాంతీయ ఆధిపత్యాన్ని ధిక్కరించినా వ్యక్తిగతంగా ఎవరిపట్లా విద్వేషం పెంచుకోలేదని పేర్కొన్నారు. ఆయన సాహిత్యం ప్రపంచ స్థాయి కవిత్వమని అభినందించారు.

ప్రొఫెసర్ కోయి కోటేశ్వర రావు మాట్లాడుతూ, "దళిత, శ్రామిక, కార్మిక శక్తులే సిధారెడ్డి గారి కవిత్వం" అని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాల హృదయ స్పందనగా ఆయన సాహిత్యం నిలిచిందని, విప్లవోద్య మం నుంచి నేటి వరకు నిరంతర సాహిత్య సృజన కొనసాగిస్తున్నారని అన్నారు.

డా. నందిని సిధారెడ్డి మాట్లాడుతూ, "నా ధైర్యం, స్థైర్యం నా ఊరు బందారం అయితే, నా బలం నా సాహిత్యమే'' అని పేర్కొన్నారు. తన సాహిత్యంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించి, సుమారు ఎనిమిది వందల పేజీల బృహత్ గ్రంథంగా వెలువరించిన తెలుగు భాషా చైతన్య సమితి, మహిళా డిగ్రీ కళాశాల, డా. జయప్రకాశ్, బడేసాబ్, శ్రీభాష్యం అనురాధ, డా. ఎడ్ల కల్లేశ్ తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో 117 మంది రచయితలు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. ప్రాహితీవేత్తలు డాక్టర్ మన్నెమోని కృష్ణయ్య, డాక్టర్ భాష్యం అనురాధ, పి. జంగయ్య, డాక్టర్ నాళేశ్వరం శంకరం, కందుకూరి శ్రీరాములు, అవసుల భాను ప్రకాష్, తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షుడు పి. బడేసాబ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎడ్లకల్లేశ్, కార్యదర్శి ఎల్.జగన్ పాల్గొన్నారు.



డా॥ నందిని సిదారెడ్డిని సత్కరిస్తున్న కందుకూరి శ్రీరాములు, బడేసాబ్, మాజీమంత్రి నిరంజన్ రెడ్డి, డా॥ నామోజు బాలాచారి , డా॥ జయప్రకాశ్.





స్పందన తెలియజేస్తున్న డా॥ నందిని సిధారెడ్డి

## బర్తీ!

'నమ్మకం' అనేది అన్ని బంధాలకు
బంధుత్వాలకు, స్నేహాలకు ఆధారమై
మనందరి జీవితాల్లో ధైర్యాన్నిస్తుంది
కానీ, డబ్బు ఆ స్థానాన్ని బర్తీ చేశాక
స్వార్థంతో దాన్ని అమ్మకానికి పెట్టాక
మనిషి క్రమంగా కనుమరుగైతున్నాడు!
అందుకే,
గొప్పలకు పోయి గోదారి ఈదడం కన్నా
గొప్పవారి పరిచయాలకై ఉవ్విళ్ళూరేకన్నా
గొప్ప మనస్తత్వమున్న వారిని గమనిస్తూ
వారిని అనుసరించడమే అత్యున్నతం!



- డా॥ డి. రాజేశ్
9440460490

## ఉత్తరం..

పాత సందూకను
సదురుతుంటే,
ముప్పై ఏళ్ళ నాటి
ఉత్తరం ఒకటి దొరికింది..
విప్పాను...
కొన్ని గులాబీలు రాలాయి,
కొన్ని తేనెవాగులు పారాయి,
కొన్ని మాటలగంధాలు కూరాయి,
కొన్ని హిమాంశువులు ఊరాయి..
పొడి ఉత్తరం తడితడిగా
చేతులను తడిమింది..
జ్ఞాపకాలూ,
వానా.. ఒకటే కదా!



-డా॥ కాసర్ల
9441406252





అమరావతి సాహితీ మిత్రులు
దశమ వార్షికోత్సవ సభ

ఆగస్టు 16న ఉదయం 10 గంటలకు
గుంటూరు బ్రాడీపేట తాలూకా ఆఫీసులోని పెన్షనర్ల సమావేశ మందిరం...
డా. పాపినేని శివశంకర్, డా. జి. వి. పూర్ణచంద్, డా. చుండూరు మాణిక్యరావు, డా. గుమ్మా సాంబశివరావు, శ్రీ బంగారు వి బి ఆచార్యులు, డా. జెల్ది విద్యాధరరావు, డా. వెలువోలు నాగరాజ్య లక్ష్మి, డా. టి. సేవ కుమార్, "నేటి నిజం" సంపాదకులు శ్రీ బైస దేవదాసు, "నవ మల్లె తీగ" సంపాదకులు కలిమిశ్రీ, శ్రీ గుత్తికొండ ధనుంజయరావు మొదలైన వారు అతిథులుగా పాల్గొంటున్నారు. 16 మంది కవుల 20 పుస్తకాలు ఆవిష్కరిస్తారు.





అందరికీ ఆహ్వానం.



డా. రావి రంగారావు, అధ్యక్షులు, అమరావతి సాహితీ మిత్రులు.

## స్వేచ్ఛకు అక్షర నీరాజనం

80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభవేళ, రెపరెపలాడే త్రివర్ణ పతాకానికి, స్వేచ్ఛను శ్వాసగా అందించిన అమరవీరులకు,భరతమాతకు భక్తితో సమర్పిస్తున్న దేశభక్తి కవితా కుసుమాలివి.

నాటి త్యాగాల స్ఫూర్తిని,
నేటి భారతపు ఆకాంక్షలను,

రేపటి వెలుగుల స్వప్నాలను అక్షరాల్లో నింపుతూ "అక్షరయాన్ - తెలుగు మహిళా రచయిత్రులు సంస్థ" భరతమాత పాదాలకు తమ కవితాక్షరసుమాలతో సమర్పిస్తున్న నీరాజనం.



-విశ్వైక,
ప్రధాన కార్యదర్శి, అక్షరయాన్

## అమృత భారతం ..నా దేశం

నా భారతదేశం..
గాయాల గర్భం చీల్చి ఉదయించిన
స్వేచ్ఛా సూర్యోదయం..
గంగలా హృదయాలను కలిపే
కరుణా ప్రవాహం..
హిమాలయంలా నిలిచే
ఆత్మవిశ్వాస శిఖరం
వటవృక్ష ఛాయలా
కోట్ల ప్రాణాలకు ఆశ్రయం ఇచ్చేది..
నా.. భారతదేశం
నా భారతదేశం
రాజ్యాంగం న్యాయదీపమై
దారిచూపే ధర్మస్తంభం..
వైవిధ్యాల పూలతో అల్లుకున్న
ఏకత్వ పుష్పహారం..
రైతు చెమట బిందువులను
ముత్యాలుగా దాచుకునే సువర్ణ నేల
సైనికుని త్యాగాన్ని శిఖరంపై
మోసే వీరగాథల .. నా..భారతదేశం.
నా భారతదేశం
వేద ఘోషలతో..విజ్ఞాన రెక్కలతో విహరించే
జ్ఞాన గరుత్మంతుని రూపం
ప్రతి బాలుడి కలలో వికసించే
రేపటి ఉదయ తామర
ప్రేమనే జాతీయ గీతమై ఆలపించే
మానవతా వీణ
సత్యమే శ్వాసగా..సేవయే శిరోధార్యంగా
నిలిచే పుణ్యయజ్ఞ వేదిక.. నా.. భారతదేశం.
మనమందరం కలిసుంటే
అది ఇంద్రధనుస్సు రంగుల సౌందర్యం
మన చేతులన్నీ కలిస్తే
అది భవిష్యత్తు గుడారాన్ని మోసే స్తంభం
జెండా రెపరెపల్లో కాదు జనహృదయాల్లో
రెపరెపలాడే దేశభక్తే
నిజమైన స్వాతంత్ర్యం
అమృతాంతరంగవై చిరంజీవిగా వెలిగిపో...
వెలిగిపోవే నా భారతదేశమా!!.

-విశ్వైక
9550183143

## దేశభవిత-వికాసం విలువలే సోపానాలు

తల్లిదండ్రి గురువులని గౌరవంతో చూసే
మనుషుల కూ మానవత్వమే మతమని చాటే
సంస్కారం, నీతి నిజాయితీ ప్రోత్సహిద్దాం.
హలంపట్టిపొలందున్నే అన్నదాతలు
ప్రాణమిచ్చైనా దేశాన్నికాపాడే సైనికుల త్యాగా
నికి ఋణం తీర్చుకుందాం
మాతృభూమిలోమాతృభాష మాట్లాడి
పుట్టుకతో అమ్మ నాన్న వడిలోనే బిడ్డలు
సహజంగా నేర్చగల్గే అవకాశం కల్పిద్దాం.
చిన్నపిల్లలకు వాళ్ళ మాతృ భాషలోనే
ఆటలాడుతూ పాటపాడుతూ సంగీత గాన
కచ్చేరీ,నాటక కళ కథలని నేర్పిద్దాం.
మహారాజుల వీరధీరసాహస గాథలను
స్వాతంత్ర్యోద్యమ
కారుల త్యాగనిరతిని
పాఠ్యాంశాలలో కథలద్వారా పో ధిద్దాం
మోసం దగా
కుళ్ళు కుత్సిత దందా గిరీల వ్యాపారం,
సైబర్ నేరాలుచేసే గుండాల
ఆటకట్టించేలా యువభవితకి బాటలేద్దాం
మానవత్వం మంటకల్పే హత్యాచారాల మత్తు
జూదం దుర్వ్యసనాల బారినపడే కర్కోటకుల
భరతంపట్టి పీచ మణుద్దాం
ప్రజాసేవే ధ్యేయమై
విశిష్ట జీవ వైవిధ్యాన్ని అధికారమదం
ఆటంబాంబులయుద్ధం,
పర్యా వరణ కాలుష్యం నుంచి కాపాడదాం
మనం దేశభక్తి సమాజ సేవా నిరతితో
అహింస శాంతి
సమైఖ్యతా ధర్మమున్యాయం విలువలన్నీ
పాదు కొల్పుదాం



-డా॥ఉషారాణి
81796 11745

## పవిత్ర భరత భూమి

పల్లవి
పవిత్ర జనని నమో నమో
నమో నమో భరతభూమి నమో నమో
మాతృభూమి
పదహారు భాషల పల్లవమై
ప్రణవ నాదమై పొంగే పుణ్యభూమి.
అనుపల్లవి
గంగా యమునా సింధు తరంగమై
జీవన సారం నింపే జనని ఇదే
వేదభూమి ఇదే కర్మభూమి ఇదే
వీరగాథల సారమై వెలిగే భూమి ఇదే
చరణం:
ధ్యాన త్యాగధనుల తపోభూమి ఇదే
మౌనివరుల సందేశం మారుమ్రోగే నేల ఇదే
భగవద్గీత సారమై రామనామ భజనై
భారతీయ జీవనమై వెలసే గేహమిదే
త్యాగరాజ తత్వమై అన్నమయ్య గీతికై
తెలుగు వెలుగై కమ్మని అమ్మ పిలుపై
చరణం:
కాశ్మీర్ అందాల నాట్యభారతి పాదమై
ప్రతి గొంతు పాడే శ్రుతి స్వరమై
బోసినవ్వుల బాపు శాంతిదూత నెహ్రూ
రూపమై
మంచిగంధాల ధూపమై హారతి కాంతుల
దీపమై
గోదావరి హారతి కర్పూర వెలుగై
పాడిపంటల నిలయమై ధన్యరాశుల శోభై
చరణం:
సాహిత్య శిరోమణి సంగీత రత్నాకరమై
పచ్చని తోటల పరిమళాల తావై
విచ్చిన పూలగుచ్ఛమై జానపద గీతమై
భరతమాత శిఖరమై మువ్వన్నెల పతాకమై
మధురమైన తేనెపట్టు కదులు ప్రవాహమై
వసంతాల వెల్లువై అభినందన గీతికై
పల్లవి:
పవిత్ర జనని నమో నమో
నమో నమో భరతభూమి నమో నమో
మాతృభూమి.

-గాడేపల్లి సూర్యకాంతి



## నేల తల్లి రుణం... స్వేచ్ఛా తరంగం!

ఉరికొయ్యలనైన ఉయ్యాలలుగా ఊగించిన అద్భుత నేల ఇది,
రుధిరాన్ని సైతం అమృతంగా మార్చిన వీరభూమి ఇది!
ఈ మట్టి రేణువులో స్వాతంత్ర్య గంధం పరిమళిస్తోంది,
ఈ గాలిలోని ప్రతి ఊపిరి పుణ్య స్ఫూర్తితో ఉద్వేగిస్తోంది.
ఉత్తరాన మంచు కిరీటంతో హిమవంతం నిలిస్తే,
దక్షిణాన మూడు మహాసాగరాల సంగమం పాదాలు కడుగుతోంది!
గంగ, యమున, గోదావరుల పుణ్య తీర్థాల సంగమం ఇక్కడ,
వేల కొలది సంస్కృతుల పొదుగు - ఇది మన భారత ఖండం!
మతాల హద్దులు మన చైతన్యాన్ని అడ్డుకోలేవు,
భాషల పొరలు మన బంధాన్ని విడగొట్టలేవు.
కులాలు, ప్రాంతాలు ఎన్ని వేరైనా...
మన రగిలే రక్తంలో ప్రవహించే నాడి ఒక్కటే, స్పందన ఒక్కటే!
భగత్ సింగ్ ధీరోదాత్త నవ్వులు, అల్లూరి విప్లవాగ్ని,
గాంధీజీ అహింసా పథం, సుభాష్ పౌరుష రజస్సు,
బాల గంగాధర్ తిలక్, సర్దార్ పటేల్ మహోన్నత త్యాగాలు...
ఆ వీరుల రక్త తర్పణమే మనకు అందిన స్వాతంత్ర్య దీపాలు!
స్వేచ్ఛ కోసం ప్రాణార్పణ చేసిన ఆ మహనీయులారా,
మీ పాదధూళిలో నడవడమే, మీ ఆశయాలను నిలబెట్టడమే
ఈ పుడమి తల్లికి మనమిచ్చే నిజమైన, శాశ్వత నివాళి.
మన కష్టమే ఈ గడ్డకు పసిడి పంటలుగా మారుతుంది,
మన ఆవిష్కరణలు విశ్వ చరిత్ర యవనికపై కొత్త గీతాలు రాస్తాయి.
సరిహద్దుల్లో కన్నుమూయని జాగరూకతతో నిలిచే సైనికుడికి,
పొలాల్లో అక్షయాహారం పండించే అన్నదాతకు శతకోటి వందనాలు!
అజ్ఞానపు గాఢ చీకటిని తరిమివేస్తూ,
అసమానతల పాశాలను తెంచివేస్తూ,
ఈ భారతావని విశ్వగురువుగా ప్రతిష్ఠ సంపాదించే వరకు...
మన పయనం ఆగదు, మన పోరాటం ముగియదు!
మువ్వన్నెల జెండా పవిత్ర నీడలో మనమంతా ఒక్క కుటుంబం.
'ఏకత' అనే ప్రాణమంత్రంతో నిండిన
ఈ సమరం వేయి యుగాలు నిలుస్తుంది.
జై భారత్! జై హింద్!

-మణి వడ్లమాని
సెల9652067891

## నేను స్వతంత్ర నేనా

నేను స్వతంత్ర నేనా..
ఈ స్వాతంత్ర్య భారతావనిలో ...
అనే సందేహంలో వుందీరోజు
నీతోబుట్టువు ...
పసిపిల్లల నుండి
పండు ముదుసలి వరకు ...
అమ్మఒడి నుండి పనిచేసే
కార్యాలయాల వరకు...
రక్షణలేని స్వాతంత్ర్యం కరువైన
ఆడపడుచుల....
ఆర్తనాదాలతో దద్దరిల్లుతోంది
నాభారతావని...
పసికూనలను కూడా వదలని
మదమెక్కిన మత్తగజాల నుండి...
ఎన్నోకలలు కంటూ
బంగరు జీవితాన్ని కోరుకునే
పుత్తడిబొమ్మలను...
ప్రేమ ముసుగేసుకొని వంచించే
కామాంధుల నుండి...
ముండ్లచూపులతో వెకిలిచేష్టలతో
ఉద్యోగినులను...
మానసికహింసకు గురిచేసే
రాక్షసానందుల నుండి...
రక్షణకై ప్రతిన బూనండని తోబుట్టవులకు ...
తెలపడానికే కలిసొచ్చింది
నేటి స్వాతంత్ర్య దినం...
నీ సోదరికి కవచధారుడవై వుంటూ ....
ఆడబతుకుకు భరోసానిస్తానని
ప్రతిజ్ఞ చేయమంటు...
అప్పుడే భారతీయులందరూ నాసహోదరులనే...
మన ప్రతిజ్ఞకర్తం వుంటుందని
నీ కర్తవ్యాన్ని తెలుపుతూ....
విశాలగగనంలో రెపరెపలాడుతూ ఎగురుతూ
స్వతంత్ర కై ఎదురుచూస్తోంది నవకేతనం...

-తిరునగరి వకుళ
9989198334

## మన దేశం

ప- శాంతికి నిలయం, స్ఫూర్తి ప్రదాయం
సకల జాతి మత సంగమం
సౌభ్రాతృత్వ జీవనం
భిన్న సంస్కృతుల మేళనం
ఇది మన భారతం
ఇది మన భారతం ॥శాంతికి॥

విశ్వ గురువు
విజ్ఞాన గని
శత్రు దుర్భేధ్య
అగ్ని పునీత
నాదేశం భారత దేశం
మహ నీయులు
నడ యాడిన గడ్డరా..
సున్నాను కనుగొన్న ఘనతరా
మనది !
వేదాలు పుట్టినా భూమిరా ఇది!
"శాంతికి"

త్యాగ చరిత !
వీర జనిత !
భాగ్యదాత భారత ఖండం
విజ్ఞాన భాండం
తత్వ బోధిని
అద్వైత సాగరి
ఖగోళ రహస్య చేదిని
ప్రణవ నాద ప్రసాదిని
సుందర భారతం
ఇది మనభారతం
"శాంతికి"

-శైలజ రాంపల్లి
హైదరాబాద్

## జైహింద్-జాతి జాగృతి

స్వేచ్ఛా వెలుగులు నింపిన పుణ్యదినం,
వీరుల త్యాగాలకు వందన సమర్పణం.
త్రివర్ణ పతాకం మన గర్వ చిహ్నం,
భారతమాతకు ఈ పౌరుని వందనం
ఐకమత్యమే మన అసలైన బలం,
దేశభక్తియే ప్రతి హృదయ స్పందనం.
సత్యం, శాంతి మన జీవన మార్గం,
సేవే మన భరతజాతి ధర్మం
అభివృద్ధియే మన లక్ష్యం,
సమైక్యతే మనకున్న అంకితభావం
స్వేచ్ఛ, స్వాతంత్రాలను కాపాడుదాం,
దేశాన్ని ముందుకు నడిపిద్దాం.
వీరుల అమరత్వాన్ని స్మరించుదాం,
భారత భవితవ్యాన్ని గౌరవిద్దాం.
..జై హింద్! వందే మాతరం!
అందాం అందరం

- శ్రీవాణి..

## ఓ భారత జననీ..... ఓహోహో పరమ పావ నీ ....

ఓ భారత జననీ...
ఓహోహో పరమ పావనీ
అందు కొనుమ వందనాలు
అభినందన చందనాలు....
నీ ఘన చరిత ను తెలుపగా
చాలవులే పదములూ...
వెండికొండ నీ సిగ లో
బొండు మల్లె గా మెరువగ
నీ చరణ కమలాలు
హిందు సంద్రమే కడుగగ
వింధ్య శ్రేణి వొడ్డానముగ
విరాజిల్లే ఓ జననీ..
"ఓ భారత జననీ"
గంగా యమునా కృష్ణా
గోదారి కావేరీ, తుంగభద్ర
నర్మదాపుణ్య నదుల కన్న తల్లి
హిందూ ముస్లిం సిక్కు
క్రైస్తవులు ఎవరైనా....
కులమతాల కతీతమౌ
అద్భుతమవు నీదు ఘనత
సమతా మమతలు పంచే
సమైఖ్యతే నీ ఉనికి గా....
"ఓ భారత జననీ"
అవనిపై విశ్వ శాంతి చాటి చెప్పు మన
జెండా...
ముచ్చటైనజెండా.......
మువ్వన్నెల జెండా.....
ఎందరెందరో వీరుల త్యాగధనుల కన్నతల్లి...
నీ ఔన్నత్యము చాటగ
పోలికలే లేవు ఇలలో
."ఓ భారత జననీ"
ఎన్ని జన్మలెత్తినా
ఈ మట్టి ఋణం తీరునా
నవమాసాలు మోసే కన్న తల్లి
ఋణం కన్న, కడ దాకా మోసే
ఈ నేల తల్లి ఋణం మిన్న....
ఎన్ని జన్మలెత్తినా నిను వీడని వరము
నిమ్మా....జన్మ జన్మల
పుణ్య ఫలమే ఈ మట్టిఋణం
ఓ జననీ...మా భారత మాతా
నీ బిడ్డల వందనాలు అభినందన చందనాలు
అందుకొనుమ వందనాలు
వేల వేల వందనాలు....
"ఓ భారత జననీ"

-డా॥అడువాల సుజాత



## వీర నారీ మణులు

మితవాద అహింసావైఖరితో గాంధేయులు..
అతివాద హింసాధోరణితో అల్లూరి,బోస్,
భగత్ సింగులు..
మరెందరో లెక్కకు మించి..
ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య
సమర యోధులు నడయాడిన నేల ఇది!.
స్వసుఖాన్ని మరచి "వందేమాతర"మంటూ..
"జైహింద్" "ఇంక్విలాబ్" అంటూ
నినాదాలతో హోరెత్తించి..
ప్రజల గుండెల్లో దేశభక్తిని ఉప్పొంగించి..
ఎక్కుపెట్టిన తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి
రొమ్ము విరచి..తమ గుండెనడ్డు పెట్టిన
మహా దేశభక్తులెందరో నడయాడిన నేల
ఇది!.
సామాజిక సేవలో తరించిన
దుర్గాబాయ్ దేశముఖ్..
తన యావదాస్తిని అనాథ శరణాలయానికి
ధారపోసిన ఐరిష్ వనిత అనిబిసెంట్!
వీపున కట్టుకున్న పసిపిల్లవాడితో..
చేత కరవాలముతో ప్రథమ స్వాతంత్ర్య
సంగ్రామానికి నాంది పలికిన ఝాన్సీ రాణి..
క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న
కవయిత్రి,"భారత కోకిల" సరోజినీనాయుడు..
అక్షరమే ఆయుధంగా తన కవితలతో
పోరాడిన కుంతలకుమారి!.
మతాంతర వివాహం చేసుకుని
గవాలియా ట్యాంక్ మైదానంలో
పతాకమెగురవేసిన ఉపాధ్యాయిని
అరుణ అసఫ్ ఆలీ..
ఒరిస్సా మదర్ థెరిస్సా ప్రభాతగిరి..
విదేశీ వస్త్ర బహిష్కరణ.చేసిన జంకీదేవి
బజాజ్!
బేగం హజ్రత్ మహల్..అవిరాణి వాస్తవ..
చెన్నమ్మ..క్విట్ ఇండియా ఉద్యమంలో
పాల్గొన్న లక్ష్మి సెహెగల్!.
ఎందరో..మరెందరో..
ఆకాశంలో సగం మేమంటూ..
ఆత్మత్యాగానికి సిద్ధపడిన మహిళా రత్నాలు..
వీర నారీమణులు నడయాడిన నేల ఇది!

-చంద్రకళ.దీకొండ
9381361384

## వికసిత భారతం కవిత

వికసిత భారతం సదా హసితం మందస్మితం
కమలాల ఉషోదయం,ఆయుష్మాన్ భారత్ తో నవోదయం
సుకన్యా సుపథం,అదే అదే అభ్యుదయం
అమ్మ పేరున చెట్టుకై నాటాలి దేశ భక్తివిత్తులు
నూరేండ్ల పండుగకు అందించు ఫలాలు సుఖశాంతులు సుజలాం
సుఫలాం
తరంతరం నిరంతరం వందేమాతరం
జనగణనతో జనగణమన జైహింద్
హస్త కళలతో వందేభారత్ పరుగులు
దివ్యాంగులు క్రీడల్లో రాణింపు అదేమేలుకొలుపు
మహిళాశక్తితో విక్రం సుపథంలో
జాతరలు బోనాలు బతుకమ్మలు థింసాతో
విశ్వవ్యాప్తం,స్త్రీల శక్తి కీర్తి అంతరిక్షం దాకా
అక్షరాల పయనం,కొనసాగుతున్న యానం
జైజవాన్ జైకిసాన్,జైవిజ్ఞాన్ తో సాగుతున్న రథం
నేత కలనేతల ప్రజాస్వామ్య పథం
ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ హమారాభారత్ మహాన్

-అచ్యుతునిరాజ్యశ్రీ
8985035283

## నా జెండా

స్వేచ్ఛా రెక్కలు విప్పుకుని-వినీలాకాశంలో
వింత శోభతో ఎగిరే విహంగమా!
ధృవతారలా కీర్తివెలుగులు- విరజిమ్ముతున్న కాంతిపుంజమా!
తెగించి పోరాడి గెలిచిన తెలుగు తేజమా!
ఆంగ్లేయుల తుపాకి కాల్పులకి ప్రవహించిన రుధిరమా!
భరతమాత ప్రియపుత్రుడు- పింగళి వెంకన్నగారి ఊహాచిత్రమా!
భారతీయతను చాటు అక్షరాలెన్ని ఉన్నా-భాషకందని భావమా!
హిమాలయ శిఖరోన్నత నీ ఘనతకి-మనసున పొంగిన గర్వమా!
శాంతి, సత్య, అహింసల-సమరసభావ సుందర త్రివర్ణ పతాకమా!
తిరుగులేని త్యాగఫలమా-తరిగిపోని ఐశ్వర్యమా- నిండుజాతి గౌరవమా!
ఎల్లలు లేని నీ వీర చరిత్రని,
ఏమని పొగడను? ఎంతని వర్ణించగలను?
నీ కీర్తి తరగల తుషార బిందువులు, నా మనసునంతా తడిపేస్తుంటే,
అవనత శిరస్సుతో, ఆనందభాష్పాలతో నీకు వందనమిడుట తప్ప.

-అడవి. అన్నపూర్ణ,
9963006976.

## మాతృభూమికి నీరాజనం!

మాతృశృంఖలాలు త్రుంచ ఏకమయిన జాతీయం!
త్యాగఫలం అందించిన స్వాతంత్ర్యము మహనీయము!
భాషమతము లేవైనా ఐకమత్య అనుబంధం!
ఒక్క తాటిపై నడిచే దేశభక్తి తులనీయం!.
దగాకోరు దురాక్రమణ రగిలించిన విప్లవాలు!
ఆత్మాహుతి దాడిలోన అమరత్వం స్మరణీయం!.
కొల్లాయిలో దాగినట్టి సత్యహింస గుండెబలం!
నిరాయుధపు పోరాటం చరితలోన ఘనసీయం!.
ఉద్యమాల సమాధులే ప్రజాస్వామ్య పునాదులు!
నిర్భయాల వీరమరణ దేశభక్తి గణనీయం!.
రాచరికపు దర్పాలను నేలరాల్చు మహోదయం!
ఎవరికి వారే రాజుల నినాదాలు రమణీయము!.
జనని జన్మ భూమికన్న నాకమేది ఓకుసుమా!
తిరిగి తిరిగి ఈనేలను పుట్ట ఆశ స్తవనీయం!.

-కుసుమ ఉప్పలపాటి
9705009254

(మిగతా 4 పేజీలో..)



## భరతజాతి 'విలాసం' మన పతాకం

రెపరెపలాడే మువ్వన్నెల జెండానడిగితే చెబుతుంది,
వెంకయ్య వైనంగా చిత్రించాడని!
మూడు రంగులు ఎందుకని అడిగితే చెబుతుంది...
దేశ కీర్తి, ధైర్యం, స్వచ్ఛత నిండి ఉన్నాయని!.
మౌర్య వీరుని ముందుచూపు ఆ అశోక చక్రం,
జీవిత చక్రాన్ని, గమనాన్ని నిర్దేశించేదే ఈ పతాకం!
ఇరవై నాలుగు ఆకుల సారాంశమే ప్రతి పౌరుని వికాసం,
మూడు రంగుల నడుమ నిలిచే చక్రం దేశ ప్రగతికి మూలస్తంభం!.
వేల భాషలు, భిన్న సంస్కృతులకు నిలువెత్తు నిదర్శనం నా జెండా,
రాష్ట్రాలుగా విభజించుకున్నా... ప్రతి గుమ్మం చిరునామా నా జెండా!
దిగంతాలు, సముద్రాలు దాటినా... అలుపెరుగక ఎగిరేదే నా జెండా,
మహాత్ముని మహోన్నత ఆలోచనకు ప్రతిరూపం నా జెండా!
ఎందరో త్యాగవీరుల పుణ్యఫలం ఈ నా మువ్వన్నెల జెండా,
సర్వ మానవ సౌభ్రాతృత్వానికి దిక్సూచి ఈ నా మువ్వన్నెల జెండా!
పాడిపంటల పచ్చదనానికి ఆలవాలం ఈ నా మువ్వన్నెల జెండా,
అలుపెరుగని పోరాట పటిమకు నిలువుటద్దం ఈ నా మువ్వన్నెల జెండా!.
వీరగంధపు వాసనలు వెదజల్లేది ఈ నా మువ్వన్నెల పతాకం,
పసిపాపల బోసినవ్వుల విరిబోణి ఈ నా మువ్వన్నెల పతాకం!
భావితరాలకు జీవన ప్రమాణం ఈ నా మువ్వన్నెల పతాకం,
నా భరతజాతి 'విలాసం' ఈ నా మువ్వన్నెల పతాకం!

-శ్రీ పేరి
9840437189

## ఘన భారతం... ఘన భారతం

మువ్వన్నెల జెండా
ముచ్చటైన జండా
ఎగురుతోంది ఎగురుతోంది
ఆకాశం నిండా
ఎందరో వీరుల త్యాగఫలం
అణువణువునా పులుముకొని!!.
స్వార్థమనేది పక్కనబెట్టి
ఆస్తిపాస్తులన్ని త్రోసిరాజని
స్వాతంత్ర్యం కోసమై
ప్రాణ త్యాగం చేశారు!!.
ఒక్కో వ్యక్తి ఒక్కో శక్తియై
ఉద్యమాన ఉరికారు
ఉరితాడుకు చిక్కారు
హుందాగా బలయ్యారు!!.
తెల్లవారి గుండెలో
గుబులు పుట్టించి
గుండు కెదురుగా నిలిచి
గుండెనే చూపారు!!.
లాల్ బాల్ పాల్ త్రయం
నేతాజీ బాపూజీ
కలలుకన్న భారతదేశం
చాచాజీ ఏలిన విశాల భారతదేశం
దాస్య శృంఖలాలు తెంచుకున్న
పవిత్ర భారతదేశం
స్వేచ్ఛా భారతం
డిజిటల్ వ్యవస్థలో అగ్రగామి
నా దేశం!!

-చీదెళ్ళ సీతాలక్ష్మి
9490367383

## విశ్వశిఖరం

మువ్వన్నెల సువాసన
ప్రపంచమంతా వ్యాపించాలి
మెదళ్ల మెరుపుతీగ
విశ్వవేదికను వెలిగించాలి.
"వోకల్ ఫర్ లోకల్"
గగనఘోషలా ప్రతిధ్వనించాలి
చేనేత సంస్కృతి
ఇంద్రధనుస్సు రేఖ
కార్మిక కళాకారుల చేతులు
దేశ నిర్మాణానికి ఆలంబన.
నేటి విద్యార్థులే
రేపటి భారత ఉదయకిరణాలు
"స్థానికం" విత్తనం స్వావలంబనకు వృక్షం
"రైజింగ్ ఇండియా" శిఖరారోహణం.

-సంధ్య సుత్రావె,
9177615967,



(3వ పేజీ తరువాయి)

## స్వేచ్ఛా ప్రణవం

పారతంత్ర్యపు నల్లని రాత్రిని చీల్చుకుంటూ,
స్వేచ్ఛ భానుడు పొడిచిన సుదినమిది.
వీరుల నెత్తుటి చుక్కల త్యాగఫలం,
మనోఫలకమున నిలిచే త్యాగధనుల స్మరణ.
ఎనభై ఏళ్ల మజిలీ దాటిన భారత సమరం,
అడుగు అడుగునా రూపుదిద్దుకున్న నవయుగం.
విజ్ఞానపు వింగడనై వినువీధికి ఎదిగిన ప్రగతి,
యువతరం గుండెల్లో రగిలే చైతన్య జ్యోతి.
చేను చెలకల నుండి రోదసి అంతరిక్షం దాకా,
స్వయంసమృద్ధి శ్వాసగా సాగుతున్న అడుగులు.
సమత సమాజమే ధ్యేయంగా సాగే గమనం,
ఐక్యతా సూత్రంతో అల్లుకున్న జనజీవనం.
వికసిత భారతి కలలను నిజం చేసే సమయం,
త్రివర్ణ జెండా నీడన సాగే విశ్వప్రయాణం.
సదా వెలగాలి నా భారతదేశ సౌభాగ్యం!

-శ్రీమతి విజయలక్ష్మి వడ్డేపల్లి
6303732862.

## కదం కదం కలుపుతూ! పదం పాడుతూ!

ఎగిరింది ఎగిరెంది మన జెండా..
కన్యాకుమారి నుండి హిమాలయోన్నత శిఖరంపై
ముువ్వన్నెల జెండా
జాతి యశస్సును నలుదిశలా చాటుతూ
బానిస సంకెళ్లను తెగద్రుంచిన
అమరులైన త్యాగధనులకు జేజేలు పలుకుతూ ..
శాంతీ సత్యం అహింసాయుధమై
సత్యాగ్రహ ఉద్యమమె ప్రజా ధర్మమై
అందరమూ ఒకటేనంటూ
జాతి మత వర్గ ధర్మాలను ఒక్కటిగా చేస్తూ
భిన్నత్వంలో ఏకత్వం.. ఏకత్వంలో భిన్నత్వం
ఒకేమతం మనదంటూ ఐకమత్యంతో
కదం కదం కలిపి..
పదం పాడుతూ స్వేచ్ఛా స్వాతంత్ర్యం
మన హక్కంటూ ఎలుగెత్తి చాటింది..
త్రివర్ణ పతాకం..
నదీనదాల ఝురులతో ఉప్పొంగిన
సస్యశ్యామలమై హరితానందాల సిరి సౌభాగ్యాల
సంపదలతో తులతూగిన నా దేశం
విలువల వటవృక్షం నీడన,
సమతా మమతల కోవెలలో

## "Tryst with Destiny…"

అర్ధరాత్రి వేళ
ఒక స్వప్న స్వరం పలికింది
"Tryst with Destiny…"
ఆ స్వరం వినిపించి
ఎనభై ఏళ్లు అవుతోంది?
బానిస సంకెళ్లు తెగిపోయాయి,
భారతం స్వేచ్ఛా శ్వాస పీల్చుకుంది!.
కాలం మారింది,
సాంకేతికత ఆకాశాన్ని తాకింది,
చంద్రుడిని చేరాము,
అంతరిక్షంలో మన జెండా ఎగరేశాము!.
అయినా
ఒక పేదవాడి ఆకలి తీరకపోతే,
ఒక బాలికకు భద్రత లేకపోతే,
ఒక రైతు కంట నీరు ఆగకపోతే
మన స్వాతంత్ర్యం ఇంకా అసంపూర్ణమే!.
కులం కాదు..సమానత్వం కావాలి!
మతం కాదు..మానవత్వం కావాలి!
భాషలు వేరైనా..భావం ఒక్కటే కావాలి!
ప్రాంతాలు వేరైనా..ప్రాణం ఒక్కటిగా కొట్టుకోవాలి!
ఎనభై ఏళ్ల క్రితం
మనం స్వేచ్ఛను సాధించాము,
ఇప్పుడు ఆ స్వేచ్ఛకు
సార్థకతను సాధించాలి!.
అప్పుడు.."Tryst with Destiny…"
ఇప్పుడు? The Tryst is not over…"
ప్రతి భారతీయుడి కల
నిజమయ్యే వరకు
భారతమా, నీ Destinyతో
Tryst …" అవుతూనే ఉండు!
జై హింద్!

-ఎన్. లహరి
9885535506

సంఘం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
బుద్ధం శరణం గచ్ఛామి అంటూ
జ్ఞాన విజ్ఞాన ప్రగతికి మార్గదర్శిగా
భవితకు దారులు వేయాలీ మనమందరం
విద్యా వినయ విధేయతలతో
కర్తవ్య దీక్షా పరులై..బాధ్యతలకు బద్ధులై
వందే భారతమంటూ! నినదించాలి

-పద్మావతి పి.
6302093356..

## భరతవృక్షం

తరాలు తరలి పోయినా..
తరగని అమూల్య
స్వాతంత్ర ఫలాలు అందిస్తూనే ఉంది.
ఎన్ని సుడిగాలులని దాటి నిలబడింది ఈ మహావృక్షనీ
ఇప్పుడు మనమందరం హాయిగా సేద తీరుతున్నాం!
స్వాతంత్ర ఫలాలు అందాయని., అందుకున్నామని.,
ఆనందించడమే కాదు..,
మనః పూర్వకమైన దేశభక్తి ధారలు భరతవృక్షంవైపు దొర్లినపుడే
నిరంతర ఫలాలు సదా అందుతాయి!
కాలానుగుణంగా..సాగే
సంస్కరణల సారాన్ని కూడా అందిస్తేనే భరత వృక్షం
మరింత పటిష్టమై ప్రపంచంలోనే ప్రతిష్టాత్మకమైన దేశంగా
పరిఢవిల్లుతుంది.

-టి.కిరణ్మయి
9441 711652

## నేనొక అక్షర దివిటీని

కవులారా ! అక్షరాయుధసైనికులారా!
కలం పట్టి గళం విప్పి సాహితీ సమరానికి
సన్నద్ధంకండి
ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని రగిలించండి
జాతి మత కులాల కుళ్ళునుకడిగేయండి
అధికార మధాందుల దుశ్చర్యల దుర్నీతిని ప్రశ్నించండి
కలుగుల్లో నక్కిన అవినీతి ఎలుకలను
మట్టుబెట్టండి
చీకటి సామ్రాజ్యవాదులను తరిమి కొట్టండి
ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి
అతివలనువేధించే కామాంధులకు బుద్ధి చెప్పండి
జన్మనిచ్చిన తల్లులను అక్కలను అవమానించకండి
స్త్రీ పురుషుల లింగ వివక్షకు చెక్ పెట్టండి
బిడ్డల భవితన్యానికి చక్కని బాటలు వేయండి
మాతృమూర్తిని మాతృదేశాన్ని మాతృభాషను మరువకండి
అక్షర దివిటీలను వెలిగించి స్వాతంత్ర్య సమరయోధుల
త్యాగాలను స్మరించుకుందాం
అణువణువునా దేశభక్తిని నింపుకొని భారతదేశ ప్రతిష్టను
పెంచుదాం
విశిష్ఠ భారతీయ సంస్కృతిని ప్రపంచ నలుదిశలా
చాటిందాం!

-కోగంటి(ఉప్పల)శాంతిశ్రీ

## స్వాతంత్ర్య వీరులు

భరతమాత దాస్య శృంఖలాలు విడిపించిన
"స్వాతంత్ర్య వీరులు"
స్వాతంత్ర్య సిద్ధికై జరిగిన పోరాటాలెన్నో
సామూహిక పోరాటంలో అసువులు బాసిన వారెందరో!
నాడు దేశమంతా ఒకటే మాట ఒకటే బాట !
ఒకే తాటిపై నిలిచిన ఉద్యమాల బాట!.
చీరాల పేరాల ఉద్యమాల బాట పట్టిన ప్రజ!
గూడు వదిలి వూరి బయట గుడారాలలో జీవనం!
తెల్లవారి దాష్టీకం తగులబెట్టిన గృహాలు!
అహింస పోరాటంలో కారాగారాల పాలయిన వీరులెందరో!
పలనాటి ఉద్యమ నేత కన్నెగంటి హనుమంతు
తెల్లవారి తుపాకీ గుండ్లకి ఆహుతి అవుతూ
దాహమంటూ ఆర్తితో అలమటిస్తుంటే
ఎవరినీ దరిచేరనీయని తెల్లవారి దౌర్జన్యం!.
స్వాతంత్ర్యసమర యోధులను బంధించి
చిత్ర హింసలకు గురిచేసి దారుణ శిక్షలకు గురిచేసిన
తెల్లవారి దూరాగతాలకు, మారణ హోమాలకు
కాలాపానీ అండమాన్ జైలు నిలువెత్తు సాక్ష్యం !.
ఉప్పు సత్యాగ్రహాలూ, 'డు' ఆర్ 'డై' నినాదాలూ
విదేశీ వస్తు బహిస్కరణలు, జాతీయ విద్యకై పోరాటాలూ
భారతీయ అహింసాత్మక పోరాట పటిమ
ఎందరొ వీరుల త్యాగ ఫలం నేటి స్వాతంత్ర్య ఫలం !.
భరతమాత దాస్య శృంఖలాలు తెంచిన
నాటి పోరాట వీరుల త్యాగ పోరాటాల
పునాదుల మీద నిలిచిన నేటి మానవాళి
ఎందరో వీరులకి నివాళులర్పించుట మన కర్తవ్యం!

- మణి నాథ్ కోపల్లె
9703044410



## స్వేచ్ఛ.. ఒక జెండా కాదు!

ఈ గాలి కదలికలో చరిత్ర ఊపిరి ఉంది.
ఈ నేల నిశ్శబ్దంలో
వీరుల అడుగుల చప్పుడు ఉంది!
ఎప్పుడో?ఒక తరం
తమ యవ్వనాన్ని తూటాలకు అర్పించింది,
తమ కలలను ఉరికంబానికి కట్టేసింది,
తమ రేపటిని మన ఈరోజుగా మార్చింది!
భగత్‌సింగ్ గుండెలో రగిలిన నిప్పు?
అది అల్లూరి అడవుల్లో విరిసిన తిరుగుబాటు మెరుపు?
సుభాష్ స్వరంలో ఉరిమిన సైనిక గర్జన?
అది గాంధీ చేతిలో ఆయుధం లేకుండానే
సామ్రాజ్యాన్ని కదిలించిన
సత్యపు అస్త్రం!
అందుకే ఈ జెండా ఒక వస్త్రం కాదు?
వీరుల శ్వాసలతో నేసిన
ముువ్వన్నెల చరిత్ర!
కాషాయం, త్యాగానికి మండే సూర్యుడు!
తెలుపు ,మనసుల మధ్య నిలిచే శాంతి వంతెన!
ఆకుపచ్చ ,రేపటి భారతాన్ని మొలకెత్తించే ఆశా విత్తనం!
ఆగిపోవద్దని
కాలం మనకు ఇచ్చిన
నీలి ఆజ్ఞ మధ్యలోని చక్రం
మనకు స్వాతంత్ర్యం వచ్చింది?
స్వేచ్ఛను కాపాడటం
ఇంకా మన చేతుల్లోనే ఉంది!
కులం పేరుతో గోడలు కట్టకండి?
మతం పేరుతో మనుషుల మధ్య మంటలు పెట్టకండి?
భాష పేరుతో హృదయాలకు తాళాలు వేయకండి?
ఎందుకంటే దేశం అంటే
పటంలో గీసిన గీత కాదు?
మనుషుల మధ్య మిగిలే
మమతకు పెట్టిన పేరు!
సైనికుడి సరిహద్దు నుంచి
రైతు పొలం వరకు?
శాస్త్రవేత్త ప్రయోగశాల నుంచి
విద్యార్థి కలల వరకు?
ప్రతి చెమట చుక్కలో
భారతం ఉంది!
ప్రతి నిజాయితీ అడుగులో
స్వాతంత్ర్యం ఉంది!
కాబట్టి?
జెండాను ఎగరేయడం మాత్రమే కాదు,
దాని గౌరవాన్ని
మన ప్రవర్తనలో ఎగరేద్దాం!
జాతీయగీతం పాడడం మాత్రమే కాదు
దేశంపట్ల మన బాధ్యతను తెలుసుకుందాం.
ఎందుకంటే?మనకు వచ్చిన స్వాతంత్ర్యం
వాళ్లు ఇచ్చిన బహుమతి కాదు,
వాళ్లు చెల్లించిన రక్తపు రుణం!
ఆ రుణాన్ని దేశసేవతో తీర్చుదాం?
విభేదాలను మన గడప దాటనివ్వకుండా
ఐక్యతకు తలుపులు తెరుద్దాం?
ముువ్వన్నెలను ఆకాశంలో మాత్రమే కాదు,
మన ఆలోచనల్లో ఎగరేద్దాం!
స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవడం కాదు
స్వాతంత్ర్యానికి
మనమే కొత్త అర్థం రాయాలి!
జెండా పైకెగరాలి?
దేశం ముందుకెళ్లాలి?
మనసులు ఒక్కటవ్వాలి?
భారతం గెలవాలి కాదు..కాదు
భారతాన్ని గెలిపించాలి!
జై హింద్!

-షేక్ నసీమాబేగం
9490440865



## నిజమైన స్వాతంత్రం!

తెల్లదొరలు వోయి నల్లదొరలొచ్చినా…
మా బతుకులు మారలేదు,
ఇంకా చీకట్లనే మగ్గిపోతాండయి!.
ఊర్ల పెద్దలంతా
తెల్లబట్టలేసుకుని తిరుగుతాండ్రు…
గానీ చిన్నపిల్లపై అంత ఘోరం జరిగితే,
నోరు విప్పే నాథుడే కరువయ్యాడు!.
చదువుకున్నోళ్లేమో కోర్టులు, సాక్ష్యాలు
అంటారు…
మా లాంటి పేదల మానానికి
రక్షణ లేని ఈ దేశంల,
ఎవరికి వచ్చింది ఈ స్వాతంత్రం..
రాత్రి పూట మా బిడ్డ దారిన వెళ్తుంటే…
ఏ కీచకుడు ఎటునుంచి వచ్చి కాటేస్తాడోనని,
గుండెలు గిలగిలా తన్నుకుంటాండయి!.
మహిళల ప్రగతిని బట్టే దేశ ప్రగతిని
కొలుస్తామన్నారు మహానుభావులు,
గానీ మహిళలకే రక్షణ లేని నాడు
ఈ దేశ స్వాతంత్రానికి అర్థమేముంది.
అర్ధరాత్రి వేళల్లో మాత్రమే కాదు…
నడిపగటి ఎండల్లో కూడా,
ఆడపిల్ల
ఒంటరిగా తిరుగగలిగే రోజు రావాలె!.
దుర్మార్గుడు కన్నెత్తి చూడాలంటే…
వణికిపోయే చట్టాలు వచ్చి,
మహిళల ప్రాణాలకు
గ్యారెంటీ ఉన్న రోజు రావాలె!.
జెండాల పండగ చేసుకుంటే సరిపోదు…
మా ఆడబిడ్డల గుండెల్లో భయం సచ్చిపోయి,
రొడ్డెమ్మడి నడిచిన రోజే
నిజమైన పండగ రోజు!
ఆ రోజే ఈ దేశానికి…
అసలైన స్వాతంత్రం!

- సర్వేశ్వరరావు నీలం
630 4664 725.

## నా భారతం.. నవ భారతం....

సుందర దేశం సుమధుర చరితం
రఘురాముడు ఏలినట్టి రమ్యప్ర దేశం
నా దేశం నవ భారతదేశం....

వేదభూమిగా నాదబ్రహ్మ గా
పురాణ పరిమళ పుండరీకమై
విలసిత వికసిత విరాజితం...నా భారతం
నా భారతం... నవ భారతం....

ధర్మ వర్తనం కీర్తి కేతనం
ఇతిహాస చరితల ఇంద్రచాపమై
పులకిత పునీత పురాతనం...నా భారతం
నా భారతం... నవ భారతం....

పరోపకారం పరమోధర్మం
అహింస జీవన అమృతస్వరమై
ప్రవచిత ప్రకటిత ప్రభాసితం...నా భారతం
నా భారతం... నవ భారతం....

వీరుల చరితం విభ్రమ గాథం
విమల సందేశ విబుధగానమై
సంభ్రమ సంగ్రమ సమరోత్సాహం...నా భారతం
నా భారతం... నవ భారతం....
మాటకు చిక్కిన మహాపురుషులు
మడమ తిప్పని మహావీరులై
విరచిత విమలత వీరోచితం...నా భారతం
నా భారతం... నవ భారతం....

సత్యం ధర్మం సమ్మిశ్రితం
చరితకెక్కిన భరత భూమియై
సహనం శాంతం సహజీవనం...నా భారతం
నా భారతం....నవ భారతం....

-బిల్ల అలివేణి
8500060978.

## దేశాన్ని ప్రేమించు..



ఎవరికి అమ్మానాన్నలు నచ్చరో
క్విట్ ఇండియా
ఎవరికి మాతృ భాష రాదో నేర్వరో
మాట్లాడడానికి ఇష్ట పడరో
క్విట్ ఇండియా
తినే కంచంలో ఉమ్మేసే
దుర్గుణమున్న హేయులారా
మనదేశాన్ని అవమాన పరిచే
క్రూరులారా
క్విట్ ఇండియా
మాదీ అనుకుంటే
దేశ చట్టాలను
న్యాయాలను ధర్మాలను గౌరవిస్తూ
ఉంటామంటే
అనండి ఐ లవ్ ఇండియా
కాదనుకుంటే క్విట్ ఇండియా

-టి.వి.స్వామి
9391109616

# ఏ విత్తనం నాటితే?!






- పి.చంద్రశేఖర అజాద్
92465 73575

ఈ రోజు ఆదివారం.

అందుకని నేనూ, మా తాతగారు వాకింగ్‌కి బయలుదేరాం. అంటే మాకు దగ్గర్లో పార్క్ వుందని కాదు. అలాగే రోడ్ పక్కన నడవటం కాదు. మాది గేటెడ్ కమ్యూనిటీ. మాకు వాకింగ్ ట్రాక్ వుంది. చెట్లు వుంటాయి. చల్లటి గాలి తగులు తుంటుంది. అందుకని బయటకు వెళ్ళనవసరం లేదు.

మా గేటెడ్ కమ్యూనిటీలో లేనిదంటూ వుండదు. ఆంజనేయస్వామి గుడి వుంది. పక్కన చెట్లు వుంటాయి. గుడిలో ఉదయం నుండి సాయంకాలం వరకు పూజలు జరుగుతుంటాయి. స్విమ్మింగ్ పూల్ వుంది. రెస్టారెంట్ వుంది. జిమ్ వుంది. రకరకాల హాల్స్ వున్నాయి. అక్కడ డాన్సులు నేర్పుతారు. రకరకాల కోర్టులున్నాయి.

ఇక్కడ రెండువేల ఫ్లాట్స్ వున్నాయి. అందులో అన్ని ప్రాంతాల నుండి, అన్ని కులాల, మతాల వారుంటారు. వ్యాపారస్థులు, ఐ.టీ. ఉద్యోగులు, ఉన్నత మధ్య తరగతి వారు. చిన్న ఆసుపత్రి ఉంది. అందుకే ఇక్కడ లేనిదంటూ వుండదు అంది. ఓ రకంగా మినీ ఇండియా ఇది. అన్నట్లు ఈ మధ్య ఓ పెద్ద స్కూల్ కూడా కట్టారు. మెయిన్ రోడ్ మాకు కిలోమీటర్ దూరంలోనే వుంటుంది.

ఇదంతా చెప్పటానికి ఒకటే కారణం. మన దగ్గర డబ్బులు వుండాలేగాని మన భద్రతకు, సుఖాలకు కొదవే లేదు. హైదరాబాద్‌లో ఇలాంటి గేటెడ్ కమ్యూనిటీలు వందల్లో వున్నాయి. అందులో విల్లాల సముదాయం వుంటుంది. ఎప్పటికప్పుడు సరికొత్త హంగులతో నిర్మాణాలు జరుగుతుంటాయి. అందులోనూ ఇప్పుడు నగరం విస్తరిస్తోంది.

అంటే ఇప్పుడు, పిల్లలకి చిన్నప్పటినుండి అన్ని సౌకర్యాలు అందించాలని పెద్దలు అనుకుంటున్నారు. అందుకు కష్టపడుతున్నారు. అప్పులు చేస్తున్నారు. అసలు మా దగ్గర మూడువేల కార్లు వుంటాయి. అవన్నీ లక్షల్లో వుంటాయి. ఇదంతా బాగానే వుంది. మాకు అమ్మా నాన్నలు ఏం నేర్పిస్తున్నారు అనేది చెప్పటానికి ఇదంతా!

మా మిస్టర్ క్లీన్ అంటారు కదా–ఇప్పుడు ఏ రంగంలో అయినా 'ఇంట్రో'లు ఎక్కువ అయ్యాయని. అందరం భరిస్తున్నాం కదా! నన్నూ భరించండి. ప్లీజ్.

ముందుగా మా గుడి దగ్గరకు వెళ్ళాం. అక్కడ జనం బాగానే వున్నారు. గుడి చుట్టూ తిరుగుతు న్నారు. గంటలు కొడుతున్నారు. పక్కన పూల దుకాణాలు, కొబ్బరికాయలు అమ్మేవారున్నారు. అక్కడ ప్రసాదాలు అద్భుతంగా చేస్తారు. నేను కూడా కొన్నిసార్లు పులిహోర, దద్ధోజనం, ఇంకొన్ని రకాలు రుచి చూశాను. తిరుమల లడ్డూలా అవి చాలా రుచి గా వుంటాయి. అవన్నీ తయారు చేసేది పూజారులే. వారికి వుండటానికి క్వార్టర్ కూడా ఇచ్చారు. గుడికి ఆనుకుని ఓ గోదాలా వుంటుంది. అదంతా సిమెంట్ చేశారు. అక్కడ పిల్లలు స్కేటింగ్ చేస్తుంటారు.

"తాతా–ప్రసాదం తీసుకుందామా!" అన్నాను.


"తర్వాత. ముందు వాకింగ్ పూర్తి కానీ" అన్నారు.

ప్రసాదం కంటే మా తాతగారి మాటలు నాకు కావాలి. బడులు తెరిచిన దగ్గర్నుండి, అసలు మాట్లాడటమే కుదరటం లేదు. తాత రిటైర్ అయ్యారు గానీ ఎప్పుడూ పుస్తకాలు, ఫ్రెండ్స్, రకరకాల చర్చల్లో మునిగిపోతుంటారు. మేం కూడా అంతే. మా పనులు మావి కదా. ముందుగా గుడి పక్కకు చూశాం. అక్కడ రెండు చెట్లు వున్నాయి. ఆ చెట్టు మొదట్లో చిన్న చిన్న విగ్రహాలున్నాయి. చెట్లకు రకరకాల పూలదండలున్నాయి. పసుపు, కుంకుమలు పూశారు. ఆ పక్కన కొబ్బరికా యలు కొడుతున్నారు. అక్కడ అయిదు సంవత్సరాల పిల్లవాడిని అలాగే ఓ పాపని తీసుకువచ్చారు. వారితో చెట్లకు నమస్కారం పెట్టమన్నారు. అలాగే సాష్టాంగ నమస్కా రాలు చేయిస్తున్నారు. శ్లోకాలు చదివిస్తు న్నారు. అలాగే పెద్దలు రెండు చేతులూ జోడి ంచి, మనసులో ఏవో కోరికలు కోరుతు న్నారు. వారు రెండు కళ్ళు మూసుకున్నారు. పెదవులు కదులుతున్నాయి. పిల్లలు కూడా మధ్యలో అమ్మలను, అమ్మమ్మలను, నాన మ్మలను చూస్తున్నారు. ఆ దృశ్యం మనోహ రంగా వుంది. అటునుండి వెనక్కి తిరిగాం. దారిలో పూల చెట్లు వున్నాయి. అవి తెంపకూ డదని బోర్డులున్నాయి. అయినా కొందరు వాటిని తెంపి కొంగులో పోసుకుంటున్నారు. ఓ పక్కన రకరకాల కుక్కపిల్లల్ని తీసుకువస్తున్నారు. అన్ని రకాల వయసువారు నడుస్తున్నారు. మా తాత నన్ను ఓ సిమెంట్ చప్టా దగ్గర కూర్చోబెట్టారు.

"నేను రోజూ నడుస్తుంటాను మనవడా? ప్రతిరోజూ పాఠాలు నేర్చుకుంటాను" అన్నారు. నాకు ఆశ్చర్యం కలిగింది.

"నడుస్తూ పాఠాలు నేర్చుకుంటారా? నడుస్తున్నప్పుడు మీకు పాఠాలు చెప్పే టీచర్ ఎవరు?" అన్నాను.

ఆయన నవ్వి అన్నాడు. "పాఠాలు టీచర్లు మాత్రమే చెప్పరు. ఉదయం మనం నడవటం మొదలుపెట్టినప్పటి నుండి నీకు



ఎన్ని దృశ్యాలు కనిపించాయి. ఎంతమంది మనుషులు కనిపించారు – వారు పిల్లలకు ఏం నేర్పుతున్నారు. ఇక్కడ యోగాలు చేస్తున్న వారున్నారు. బయటకొచ్చి ఫోన్లు మాట్లాడుతూ తమ బాధల గురించి చెప్పుకుంటు న్నారు. అలాగే ఫ్రెండ్స్ కలిసి రకరకాల విషయాలు మాట్లాడుతున్నారు. బాధ కలిగినప్పుడు గట్టిగా మాట్లాడు తున్నారు. అప్పుడు పక్కన మనుషులు వున్నారని మరిచిపోతున్నారు కదా!"

"అవును" అన్నాను.

"లైబ్రరీలోకి వెళ్ళు. అక్కడ నువ్వు పుస్తకాలను చదవటమే కాదు. పుస్తకాలు చదివేవారిని జాగ్రత్తగా గమనించు. వారి ముఖంలో పలికే భావాలను చూడు. అవన్నీ కూడా గొప్ప పాఠాలే" అన్నాడు తాత.

"అంటే మీరు నడుస్తూ, చదువుతూ కూడా ఇవన్నీ చేస్తుంటారా? అప్పుడు ప్రమాదాలు జరగవచ్చు కదా" అన్నాను.


"ప్రమాదాలు జరగకుండా అన్ని పనులూ చేయటం ఓ కళ" అన్నాడు. తిరిగి మేం ఇంటికి బయలుదేరాం.

"తోలు తీస్తా" అని వినిపించింది. ఉలిక్కిపడి వెనక్కి తిరిగాం. అక్కడ ముప్పై సంవత్సరాల మహిళ వుంది. ఆమె పక్కన అయిదు సంవత్సరాల అబ్బాయి!

"తోలు అంటే తెలుసా?" అంటోంది. వాడు అడ్డంగా తలూపాడు.

"రా మనవడా? వెళ్దాం" అని తాత నన్ను ముందుకు నడిపించాడు.

"ఇప్పుడు నీకు అర్థం అయిందా? మనం ఎలాంటి విత్తనాలు నాటితే అలాంటి పంటలే పండుతాయి. మనకు కావలసింది అన్ని సౌకర్యాలు మాత్రమే కాదు. సెక్యూరిటీ మాత్రమే కాదు. మన భాషలో, మన ప్రవర్తనలో కూడా సభ్యత, సంస్కారం, వినయం వుండాలి" అన్నాడు మా తాత.





## కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

## విధిచేతిలో వింత. బొమ్మలు

ఇంటినే వదిలారో
దూరంగా విసిరేయబడ్డారో
నిత్యం కన్నీటి కడవలైన నేత్రాలు
కదిలిస్తే అశృవుల గాథలు..
నగరాల్లో, వీధి కూడళ్ల వద్ద..
ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తారు..
చిరిగిన మాసిన దుస్తులతో..
అట్టలు కట్టిన శిరోజాలతో..
దీనంగా చేతులు చేస్తూ..
భిక్షాటన చేస్తూ
లేదా దొంగతనాలు చేస్తూ..
కనిపిస్తారు వీధి బాలలు..
తల్లిదండ్రుల అక్రమ సంతానమో..
ముష్టి వాళ్ల చేత చిక్కిన
విధి వంచితులో..
రోడ్డు మీద చెత్త ఏరుకుంటూ..
రకరకాల వస్తువులు అమ్ముతూ..
కార్మికులుగా పని చేస్తూ కనిపిస్తారు..
మాదక ద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు
లోనవుతారు..
మత్తులో నేరాలు, ఘోరాలు చేస్తారు..
సరియైన తిండి, నిద్ర వుండదు..
అపరిశుభ్రత వలన
అనారోగ్యం పాలవుతారు..
నిరంతరం అభద్రత, మానసిక
ఆందోళన..
ప్రభుత్వం, ప్రజలు కలిసి
వీరి బాధ్యత తీసుకుని..
భద్రత కల్పించి, చదువు నేర్పించి..
సమాజానికి పనికి వచ్చేలా తయారు
చేయాలి..

-పంతుల లలిత
+91 82477 57492

## కలల సౌధము

కలలతో మొదలవుతుంది ప్రతి ఉదయం,
ఆశలతో నిండిపోతుంది ప్రతి హృదయం.
చిన్న కల అయినా చిగురించే దీపమై,
మన జీవిత మార్గానికి వెలుగై నిలుస్తుంది.
కలలు కేవలం నిద్రలో
వచ్చే చిత్రాలు కావు,
మన గమ్యానికి దారి చూపే నక్షత్రాలు
అవి.
పడి లేస్తూ సాగిన ప్రతి అడుగులో,
విజయపు సౌధాన్ని నిర్మించే శిల్పాలు అవి.
ఒక రైతు కలలో పచ్చని పంటలుంటాయి,
ఒక విద్యార్థి కలలో
వెలుగైన భవిష్యత్తుంటుంది.
ఒక శాస్త్రవేత్త కలలో కొత్త ప్రపంచముంటే,
ఒక కవి కలలో
మానవత్వపు సంగీతముంటుంది.
కలలే మనసుకు రెక్కలు ఇస్తాయి,
కష్టాల సముద్రాన్నీ దాటించే
పడవలవుతాయి.
ఆత్మవిశ్వాసం అనే గాలి వీచినప్పుడు,
అవి విజయ తీరాలకు తీసుకెళ్తాయి.
కలలు కనని జీవితం వెలుగులేని దీపం,
లక్ష్యం లేని ప్రయాణం దారిలేని నావం.
కలలే మనిషిని సాధారణం నుంచి
అసాధారణ శిఖరాలకు చేర్చే మెట్లు.

## జీవన పయనంలో ధైర్యంగా సాగాలి

జీవితం సుఖ దుఃఖాల సాగరం
అన్నింటిని తట్టుకుంటూ పోవాలి
బాధలొచ్చాయని భయపడకూడదు
ఓటమి ఎదురవుతుందని ముందే
ఊహించి..
లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నం నిలపకు
అడ్డంకులు ఎన్ని ఎదురైనా ఆపకు నీ
పయనం
నడిచే దారిలో ముళ్ళు రాళ్లు ఉన్నాయని
పూల బాట కాదు అని బాధపడుతూ
కూర్చుంటే
విజయం నీ సొంతం కాదు ఎన్నటికీ
కష్టాలు కలకాలం ఉండవు అనుకుని
ముందుకు సాగుతూ పయనిస్తూ..
సుఖాల తీరం చేరుతావు అని నమ్మకం
పెంచుకుని
బాధ్యత మరువక నీ వాళ్లకు భరోసాగా
నిలిచే ప్రయత్నంలో..
ఆటుపోట్లు ఎన్ని ఎదురైనా చింతించకు.
కడుపున పుట్టిన వారిని కాచుకునేందుకు
ఇన్ని బాధలా అని తల పట్టుకోకు
కాచిన చెట్టుకే కదా కర్ర దెబ్బలు
అందుకే..
జీవన పయనంలో సుడి గాలులు ఎన్ని
వచ్చినా బెదరక..
కట్టె కాలే వరకు నిజాయితీగా నిలవాలి.
అపుడే మనకు సమాజంలో మంచి స్థానం
లభిస్తుంది.

-మోదేపల్లి శీనమ్మ
+91 97048 54615

## మన చేతల్లోనే ఉంది అంతా

పచ్చ పచ్చని చెట్లతో
గలగల పారే నదులతో
కిలకిల రావాల పక్షులతో
పుడమి పాడింది ప్రకృతి రాగం నాడు
యంత్రాల ఘోషల్లో
కాలుష్య కోరల్లో
ప్లాస్టిక్, విషవాయుల కౌగిట్లో
పుడమి నలుగుతుంది నేడు.
మనుషిలో పెరిగే స్వార్థం
చెట్లను నరుకుతున్నాడు
అడవులను ఆక్రమిస్తున్నాడు
నదులను కాలుష్యం చేస్తున్నాడు.
జాలువారే జలపాతాలు
కనుమరుగాయే
ఋతువుల రాగం గతితప్పే
పకృతి పగపట్టే.
నాణానికి ఇరువైపులాన్నట్లు
హరిత శోభ ఓవైపు
మసిబారిన మసక ఓవైపు
మన చేతుల్లోనే ఉంది
పుడమి తల్లి ఆయతి.
చెట్లను నాటు కాలుష్యం నివారించు
నదీ జలాలు కాపాడు
ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టు
జీవజాతులను కాపాడు.
ఓ మనిషి స్వార్థం వీడు
పకృతితో మమేకమవ్వు
స్వచ్ఛమైన గాలులు పీలుద్దాం
భవిష్యత్తరాలకు అందిద్దాం

-చాగంటి రాణి
+91 83677 49366


అందుకే యువత హృదయంలో
కలలు మండాలి,
అవి దేశ భవిష్యత్తుకు
దివ్యజ్యోతులవాలి.
ప్రతి కల ఒక కొత్త ఉదయాన్ని
పిలుస్తూ,
మన భారతాన్ని
మహోన్నతంగా తీర్చిదిద్దాలి

-కె. కె. రామచందర్
.+91 94934 02139




# వ్యక్తిత్వ వికాస పరిమళం- దర్పణం

పుస్తక సమీక్షలు




ప్రతులకు: చింతలపల్లి రాజిరెడ్డి
7799898533

ప్రవర్తన మరియు వ్యక్తిత్వం ఆధారంగా మనుషులు నాలుగు రకాలుగా ఉంటారని అంటారు. సామాజిక బాధ్యత, వృత్తి ధర్మం లేనివారు.నిర్లక్ష్యం వీరి లక్షణం. అంకితభావంతో, బాధ్యతగా వ్యవహరించే ఉత్తమ వ్యక్తులు. చెడు ఆలోచనలతో, మంచిగా నటిస్తూ మోసం చేసే కపటధారులు. కేవలం తమ గురించి మాత్రమే ఆలోచించేవారు స్వార్థ పరులు. తన కోసం ఆలోచించ కుండా పరుల బాగు కోసం ప్రాకులాడే వారు కొందరుంటారు.వారు ఎదుటి వారి ఆనందంలో తమ ఆనందాన్ని వెతుకుతుంటారు. అలాంటి వారిలో ఒకరుగా, అనుక్షణం శివనామస్మరణతో, చేతనైన సహాయం చేయాలనే సంకల్పంతో జీవిస్తున్న వ్యక్తి,, నరనరాన శివభక్తిని జీర్ణించుకున్న పరమ భక్తుడు, మానవత్వాన్ని నిలువెల్లా నింపుకున్న మానవతా మూర్తి, శివాలయం రాజన్నగా అందరి హృదయాలను గెలుచుకున్న వాడు చింతలపల్లి రాజిరెడ్డి గారు.

ఎక్కడ ప్రవచనాలున్నా,ఎక్కడ మంచి మాటలు విన్నా రాజిరెడ్డి గారు అక్కడికి వెళ్తారు.. విషయాలను శ్రద్ధగా వింటారు.అవసరమైతే వాటిని అక్షరబద్ధం చేస్తారు.వాటిని పదిమందికి విన్పించాలనే ఆరాటం...ఒక్కరిలోనైనా మార్పు రావాలనే ఆయన పోరాటం.

మనం సినిమాలు చూస్తాం, పుస్తకాలు చదువుతాం. ప్రవచనాలు వింటాం.గొప్పవారి ఉపన్యాసాలనూ వింటాం.కాని విన్న,చదివిన,చూసిన అంశాలను మరచిపోతుంటాం...అది సహజం.అందుకే రాజిరెడ్డి గారు తాను విన్న,చూసిన,అనుభవైక విషయాలను గ్రంథస్తం చేయడం ద్వారా భావి తరాలకు అందించవచ్చుననే సంకల్పంతో ఈ పుస్తక ప్రచురణకు పూనుకున్నారు.

ఇందులోని విషయాలన్నీ ఎక్కడో ఒకచోట విని ఉన్నవే. చదివియున్నవే. కాని అవసరమైనపుడు వెతుక్కోవలసిన పనిలేకుండా ఉత్తమమైన అంశాలను ఇందులో చేర్చి మనకందించే ప్రయత్నం చేశారు.ఒక యజ్ఞంగా భావించి దర్పణం మన ముందుంచారు. అందుకు వారికి అభినందనలు.

విలువలు లేని జీవితం వలువలు లేని దేహం లాంటిది.వస్త్రధారణతో మన దేహ సౌందర్యం ద్విగుణీకృతమైనట్లు విలువలతో మన జీవితం పరిపూర్ణమౌతుంది. విలువలు కలిగిన మనుషులు సమాజానికి ఎంతో అవసరం.

దర్పణం నైతిక విలువలకు దర్పణం. దర్పణం మనుషుల్లో ఉండాల్సిన గుణాలేవో చెపుతుంది. సమాజంలో ఎలా ఉండాలో,ఎలా ప్రవర్తించాలో వివరిస్తుంది.ఆనందంగా జీవించాలంటే ఏం చేయాలి? కర్మఫలం అంటే ఎమిటి? భగవంతుడు అంటె ఎవరు? ఆనందం ఎక్కడ ఉంది? తృప్తి లేని జీవితం ఏమౌతుంది? సమస్యలనెలా ఎదుర్కోవాలి? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానం దొరుకుతుంది. వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తుంది. అంతే కాదు...బాగా ప్రాచుర్యం పొందిన పాటలు, పద్యాలు, భజన పాటలను, సూక్తులను కూడా చేర్చడం పుస్తకానికి మరింత వన్నె తెచ్చాయి.

ఇందులోని విషయాలు, పాటలు, పద్యాలు అన్నీ కూడా వాట్సప్ గ్రూపులో నుండి,వీడియో ఆల్బంలో నుండి ,ఇతర మూలాలు నుండి సేకరించినవేనని ముందుగానే రాజిరెడ్డి గారు చెప్పుకున్నారు. ఆయా రచయితలకు కవులకు తన మాటలో ముందుగా ధన్యవాదాలు ప్రకటించారు కూడా.

చింతలపల్లి రాజిరెడ్డి గారు అందించిన ఈ పొత్తాన్ని అందరూ చదవాలని ,మంచి విషయాలను సొంతం చేసుకోవాలని కోరుకుందాం.



-డా॥వైరాగ్యం ప్రభాకర్
9014559059

# తెలుగు కవిత్వంలో 'నానో' ప్రస్తానం- ఎస్.ఆర్.పృథ్వీ




ప్రతులకు:
ఎస్.ఆర్. పృథ్వీ
సెల్:9989223245

తెనుగు కవిత్వంలో శ్రీశ్రీ ఒక కొత్త మార్గానికి చేసిన అంకురార్పణ నూతన శకారంభానికి దారి తీసింది.. 1953 నాటికి కుందుర్తి 'ఫ్రీవర్స్' వచన ప్రక్రియ ఆవిర్భవింప చేసినప్పటి నుంచి అయిదు దశాబ్దాలుగా తెలుగు కవితా రూపాలలో నూతన ప్రక్రియలు ఆవిష్కృత మవుతున్నాయి. హైకూ, రుబాయి, వ్యంజకాలు, మినీ కవిత, నానీ వంటి కవితా రూపాలు మైక్రో కవిత్వంగా పేర్కొనవచ్చు. కవిత్వంలో మీటరు ప్రామాణికంగా, సూక్ష్మాతి సూక్ష్మమైన రూపాన్ని 'నానో' కవిత్వంగా, ఈగ హనుమాన్ 2005లో సృష్టించారు. 2006 ఉగాది నాటికి అందెశ్రీ, యస్.ఆర్. భల్లం నానో బ్లాగ్ ప్రారంభించారు. లఘు కవిత్వంలో 'నానో' ప్రస్థానం గురించి ఎస్.ఆర్.పృథ్వీ, 20 పేజీల సూక్ష్మ సంక్షిప్త రచన అభినందనీయం. నూతక్కి, పోత గాని, బొబ్బిలి, సబ్బిని, బొమ్మరాతల, పరుచూరి, పృథ్వీ, జ్యోతిర్మయి మొదలైన వందలాది ప్రతిభావంతులైన కవులు ఎందరో పుస్తకాలు కూడా వెలువరించారు.

సామాజిక పరమైన అంశాలు రైతులు, పరోపకారం, ప్రేమ, ఆకర్షణ, దోపిడీ, చేనేత, యోగా, అనుబంధాలు, కులమతాలు, రాజకీయం, త్యాగం, అక్షరం, తాత్త్వికత, సెల్‌ఫోన్లు, మట్టివాసన, లౌక్యం, ద్వేషం వంటి ఇతివృత్తాలపై 'నానో' కవుల కవితా స్పందన ఎస్.ఆర్.పృథ్వీ, ఈ ప్రస్తానంలో పేర్కొన్నారు. బొబ్బిలి జోసెఫ్, ఈగ హనుమాన్, పోతగాని సత్యనారాయణ, ఎన్.ఆర్.పృథ్వీ, వల్లభాపురం జనార్ధన, అనంతోజు కృష్ణ మోహన్, జి.వి.ఆర్.కె. సుబ్బరామమూర్తి, మాల్యశ్రీ, వెంకట రాణాప్రతావ్, ఆకుల రామయ్య, భూవూ శ్రీనివాస్‌లను ఉదహరించారు. 'నానో'లతో సూక్ష్మత, గాఢత, క్లుప్తతతో సామాజిక చైతన్య లక్ష్యంతో వందలాదిగా కవులు, ఈ రెండు దశాబ్దాలలో అంతర్జాలంలో నానో పుష్ప పరిమళాన్ని ఆఘ్రాణింపచేయటం తెలుగు సాహితీలోకానికి శుభపరిణామం.



-జయసూర్య
9440664610

# సమస్యలపై స్పందిస్తూ, అన్యాయాన్ని ప్రశ్నించేవాడు కవి




పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్, ఆగష్టు 12:సమకాలీన సమస్యలపై స్పందిస్తూ,అన్యాయాన్ని ప్రశ్నించేవాడు కవి అని గనులు భూగర్భ శాఖ విశ్రాంత డైరెక్టర్ వి.డి. రాజగోపాల్ అన్నారు. భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో హైదరాబాదు త్యాగరాయ గానసభ లోని కళా సంగీత నాట్య వేదికపై వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన శనివారం రోజున జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరై వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన కవితారామం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవి సమాజానికి హితం చేసే రచనలు చేస్తూ, సమకాలీన సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపుతూ సమాజ హితం కోసమే కవిత్వం రాయాలని అన్నారు. సమాజంలోని లోపాలను ప్రశ్నించే తత్వాన్ని కలిగి ఉండాలని సమాజాన్ని మార్చే దిశలో కవిత్వం ఉండాలని అన్నారు. సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన మరొక పుస్తకం వైద్యో నారాయణో హరిః సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేకమైన అంశాలపై చక్కని సంకలనాలు వెలువరించిన ఘనత వైరాగ్యం ప్రభాకర్ దని పేర్కొన్నారు.ఈ సందర్భంగా చక్కని కవితలను అందించిన కవులు కవయిత్రులను అభినందించారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ఖండేరావు రమేష్ రావు పర్యావరణహిత రచనలు కవులు విరివిగా చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన వక్తలుగా విచ్చేసిన చౌదూరి నరసింహారావు కవితా రామం సంకలనంపై, వోటూరి నారాయణరావు వైద్యో నారాయణో హరిః పుస్తకం పై సమీక్షలు చేశారు.సభా కార్యక్రమం లోడె రాములు ఆహ్వానం పలుకగా కవులు ముందుగా జరిగిన కవితా సమ్మేళనంలో వివిధ అంశాలపై కవితా పఠనం చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన కవులను సర్టిఫికెట్ శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు.కార్యక్రమంలో ఇరు తెలుగు రాష్ట్రాల కవులు పాల్గొన్నారు.



-డా॥రావి రంగారావు
9247581825

ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.

ఈ వారం వచన కవితల వర్క్ షాపులో 35 మంది కవులు పాల్గొన్నారు. ఏడుగురి కవితలు బాగున్నాయి. వీరి కవితలు చదవండి.

అంశం : యువతరం

-సంపాదకులు

## ప్రభంజనం

ఓ ప్రపంచ యువకుల్లారా,
సెల్ ఫోన్ ప్రేమకు బానిసల్లారా,
లేవండి, ఆ సెల్ నుండి...
బయటకి ఒక్కసారి చూడండి...
నువ్వో ఉప్పొంగే కెరటం,
నువ్వో ఉక్కు నరం,
నువ్వో నిప్పు కణం..
నీ పేరు యువజనం...
నువ్వడుగేస్తే ప్రభంజనం...
నీవొక అలుపెరుగని ప్రవాహం,
నీవొక విరామ మెరుగని ప్రసంగం,
నీవొక ఊహకు అందని ప్రమాదం,
నీవొక ఉరకలు వేసే ప్రమోదం...
నీ రక్తం వేడి,
నీ పలుకు వాడి,
కట్టావో అక్షరంతో జోడి,
అన్యాయం గుండెల్లో అలజడి...
నీవొక కిరణం,
వచ్చింది ప్రశ్నించే తరుణం,
చేసే అవినీతిపై రణం,
త్రివర్ణ పతాకమే నీకు ఆభరణం...
నీ స్నేహం సమత,
నీవే మా నవత,
నీవెంటే జనత,
నీ పేరు.. యువత

-రాజ్ తొర్లపాటి
7659936724

## యువతరమా.!

నవతరానికి
నాంది పలికే నిను
వర్ణించతరమా?.
నెత్తురు పొంగే
శక్తులు నిండిన
యువతరమా....
నెరిసిన తలలు
మెరిసే మీసాలకు
నల్లరంగు పులిమి
సత్యాన్ని ఆపహరిస్తుంటే...
గుట్టు రట్టు చేసే
దమ్మున్న నీకు సెల్యూట్!.
దేశ భక్తి
పల్లవి అందుకుని
పాదం కదిపి
పళ్లు కొరికిన
నీ ధర్మాగ్రహం
దేశం ముంగిట
పసిడి పంటలు పారించే
జీవ నదే...
ఈ దేశం నీది,
భారతమాత నీ తల్లి,
ఈ నిజ మెరిగిన
మీరే మీరే
దేశమాత వారసులు...
పడక కుర్చీలో
మీనమేషాలు లెక్కించే
చల్లారిన రక్తం కాదిప్పుడు
దేశానికి కావలసింది.
దేశమాతకు
ఊపిరి ఆడనివ్వక
గొంతు నులుముతున్న
రాక్షస పిడికిళ్లను
తెగనరికే
ఉడుకు రక్తమే
కావాలిప్పుడు...
యువ కాంతి పుంజమా,
నీకు
తెలియదని కాదులే...
వధ్య శిలపైనున్న
భారత మాతకు
నీవే నీవే పెన్నిధి ...
నీదే నీదే ఈదేశం ,
దేశ సస్య శ్యామలానికి
నీ రక్తమే జీవనది...
ఈ దేశ భవిష్యత్తుకు
నీవే...
నీవే నీవే నీవే
విధాతవు...

-గోలి మధు
9989186883

## అగ్నిరెక్కల తరం

యువతరం అంటే
వయసుకు మరో పేరు కాదు;
కాలపు గర్భంలో మొలిచిన అగ్నిబీజం,
పర్వతాలను చీల్చుకుంటూ
సాగరాన్ని చేరే నదిలా
అసాధ్యాన్నీ సాధ్యంగా మలిచే
అచంచల సంకల్పం.
చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉండటం గొప్పతనం
కాదు;
హృదయంలో
మానవత్వం వెలగడమే మహోన్నతం.
కృత్రిమ మేధ కొత్త యుగాలకు
తలుపులు తెరవచ్చు;
వివేకం మౌనమైతే మాత్రం
మనిషి భవిష్యత్తే చీకటిలో కలిసిపోతుంది.
పరీక్షా పత్రం లీకైతే చెల్లాచెదురయ్యేది
కాగితం కాదు..లక్షలాది కలలు;
న్యాయం కోసం లేచిన యువస్వరం
అన్యాయాన్ని ప్రశ్నించిన ప్రతిసారీ
భారత భవిష్యత్తుకు కొత్త దిక్సూచిగా
నిలుస్తుంది.
సరిహద్దుల్లో సైనికుడి అప్రమత్తతగా,
ప్రయోగశాలలో శాస్త్రవేత్త ఆవిష్కరణగా,
పొలంలో రైతు చెమట చుక్కగా,
తరగతి గదిలో గురువు వెలిగించిన దివ్వెగా,
యువతే జాతి జీవనాడిగా స్పందిస్తుంది.
భగత్‌సింగ్ జ్వాల, అల్లూరి దారి,
కలాం కలలకు
తొడిగిన రెక్కలు సాక్ష్యమిస్తున్నాయి ?
చరిత్రను మార్చేది వయసు కాదు;
సంకల్పం అని.
అవినీతిని చూసి మౌనంగా నిలవకు
యువతా;
నిజం కోసం నిలబడటమే నీ అసలైన
విజయం.
అగ్నిరెక్కలు విప్పు యువతరమా?
అధికారం కోసం కాదు, బాధ్యత కోసం;
వ్యక్తిగత విజయాల కోసం కాదు?సమష్టి
స్వప్నాల కోసం జ్వలించాలి.
రేపటి భారతదేశం రాజధానుల్లో కాదు?
యువ హృదయాల్లో రగిలే సంకల్పాగ్నిలోనే
తన స్వర్ణయుగాన్ని ఆవిష్కరించుకుంటుంది.

-పేర్లి దాసు
9963249775

## "మార్పుకు నీవే నాంది"

యువత అంటే వయసు కాదు...
వెలగాల్సిన రేపటి తరం...
వారి రక్తనాళాల్లో ప్రవహించేది
కేవలం రక్తం కాదు...
రేపటి చరిత్రను గొప్పగా రాసే సిరా...
కానీ నేడు...
వేళ్లలో ప్రపంచాన్ని బంధించిన ఫోన్ ఉంది,
మనసులో మాత్రం...
తమను తాము వెతికే వెలితి ఉంది.
నీవు చూసే తెర వెలుగులలో...
నీ స్వప్నాల వెలుగు మసకబారకూడదు.
వైరల్ కావాలనే తపనలో
విలువలు వైరస్ కాకూడదు.
యువతా!
నీ భుజాలు ఉన్నది సెల్ఫీల కోసం కావు...
సమాజ భవిష్యత్తు మోయడానికి.
నీ కళ్లలో వినోదం మాత్రమే కాదు,
విప్లవం కూడా మెరవాలి.
నీ అడుగులు ఉద్యోగంతో ఆగిపోకూడదు;
ఉద్యమంగా మారి...
ఉన్నత సమాజానికి దారులు వేయాలి.
నీ కలం
పరీక్షా పత్రాలకే పరిమితం కాకూడదు;
అన్యాయాలపై ఆయుధంగా మారాలి.
నీ గొంతు కేరింతలతోనే కాదు,
పీడితుల పక్షాన
ప్రతిధ్వనించాలి.
చరిత్రలో నిలిచిపోయినవాళ్లు
కాలాన్ని నిందించలేదు...
కాలాన్నే మార్చేశారు.
గాలి వీచిన వైపే..
ఆకులు కదులుతాయి.
కానీ యువత...
గాలికే దిశ చూపే తుఫానై నిలవాలి.
యువతా!
నువ్వు మౌనమైతే
అవినీతి మాట్లాడుతుంది.
నువ్వు భయపడితే
అన్యాయం రాజ్యమేలుతుంది.
ఉద్యోగం సంపాదించు...
కానీ..
ఉనికిని అమ్ముకోకు.
డబ్బు సంపాదించు...
కానీ..
ధర్మాన్ని తాకట్టు పెట్టకు.
పదవి పొందు...
కానీ...
ప్రజలను మరచిపోకు.
నువ్వు అమ్ముడుపోతే
దేశ భవిష్యత్తే అంగడిపాలవుతుంది.
యువతరం మేల్కొంటే
ప్రతి ఉదయం స్వాతంత్ర్య గీతమే అవుతుంది.
గుర్తుంచుకో యువతా...
నువ్వు నీ ఇంటి ఆశవే కాదు,
ఈ దేశం రేపటి శ్వాసవు ...
నీ విజయం నీ జీవితాన్నే కాదు...
ఒక జాతి భవిష్యత్తునూ మార్చగలదు.

-వి. వి. రావ్
9849559581.

## యువతరంతో మన తరం

యువతరం
కొత్త నీరు పారే
నదికి చిహ్నం,
నవ్య ఆశల్ని చేరే
వేకువకి మార్గం,
నీరసం తెలియని ప్రయాణం,
పౌరుషం ప్రజ్వరిల్లే సైన్యం,
నిప్పు జ్వాలల్ని పట్టుకునే తెగింపు,
నింగి అంచుల్ని అందుకునే వాదింపు...
ధ్యేయం నిశ్చయమైతే
దేశమంతా ఒకటయ్యే
రేపటితరం నాయకులు,
ధైర్యం ఆయుధమైతే
అద్భుతాలు సృష్టించే
తరతరాల వేదికలు,
సమాజ వృద్ధాప్యాన్ని కడిగేసే
అమృత భాండాలు,
ఛాదస్తపు చీకటిలో వెలిగించే
సువర్ణపు దివిటీలు...
యువతరంఒక తరం మాత్రమే కాదు,
అభివృద్ధి గమ్యానికి నూతన దారులు వేసే
నిరంతర చోదకం,
రండి...కదలండి...
మన తరం ఏదైనా
మన బాధ్యత మొదలెడదాం,
పిడికిలి బిగించిన యువత
అడుగు ముందుకేసింది,
అటువంటి యువతరానికి గొడుగు పడదాం,
ఆ చిత్తశుద్ధి నిండిన నవతరాన్ని గౌరవిద్దాం.

-శ్రీఅరుణం శ్రీనివాస్
9885779207

## నీ దారెటు

నీ భుజమ్మీద
వేట గాని బాణానికి
గాయపడ్డ పావురం వచ్చి
వాలింది.
నీ కళ్లెదుట..
చెదలు కొరుక్కుతినేస్తున్న
దేశ పటం విసిరేసిన
విస్తరిలాపడుంది .
నీ కాళ్ళ దగ్గర
ఎవరో మానవతి
తోడేళ్ళ గుంపుకు బలైన
కుందేలు
పిల్లలా రక్తపు గుడ్డలతో
ఈ దేశ జెండాగా ఎగురుతోంది.
ఓ యువతీ యువకుల్లారా
చీకటి బెబ్బులిని చీల్చుకుంటూ
ఆకాశం లో ఉదయించే
నక్షత్ర సూరీళ్లారా..
మా నమ్మకం మీరే
రేపటి ఉదయకాంతి మీదే..
సెల్ ఫోన్ పట్టిన చేతులతో
నీతి నిజాయితీ
చీపుళ్ళు ధరించండి..స్వచ్ఛభారతం
మీ మేధస్సుతో ప్రసరించండి.
విద్వేషాలకు ఇది నిలయం కాదు
విద్రోహాలకు ఇక్కడ వేదిక లేదు
తోటలోని పువ్వుల నవ్వులు పూసి
తేటనీటి సెలయేళ్ళ గల గల
రాగాలతో ఉచ్చల జలధి తరంగం
కావాలి.
ధర్మప్రభోధాల కుటిల
పన్నగను
పసిగట్టి పడగ మీద
కొట్టాలి
అవర్ణమై స్వర్ణ భారతి
వెలుగులకు మీరంతా
కందెనగా
గాలిలో పరిమళ భరిత
సుగంధమై ..సుమధుర
భాషిణ కావాలి..
అందుకో రాగం..
జనమనగణం..
అంతా ఒక్కటే

-నేలపూరి రత్నాజీ
8919998753

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1850వ రోజు **'మానవ అక్రమ రవాణా'** అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. **'మానవ అక్రమ రవాణా'** అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839

## వీళ్ళూ మనుషులేనా!!!?

మనిషి
తల్లిపాల ప్రేమతో
పెద్ద పెరిగినా
తల్లి లాంటి ఆడపిల్లలకు
శాపంగా మారుతూ
కాసులకు కక్కుర్తిపడి
తోటి మనుషుల
రక్తమాంసాల
కూడు తింటుండు.
ఈ ధరణి
అమ్మ స్వరూపమని తెలిసినా
కర్కోటకుడిలా మారి
నమ్మిన వారికి వెన్నుపోటు
పొడిచి
భూ కబ్జాలకు తెగబడి
మానవ రూపంలో
మృగమౌతుండ్రు
లంచాలకు దురాశపడి
కాపలా అధికారులే
సంతలో సర్టిఫికెట్స్
జారీచేస్తుండ్రు.
చేసే పని తప్పని తెలిసినా
శిక్షలను తప్పించుకొని
అతితెలివితో
దొంగాటంతా దొరతనంతో
చేస్తుండ్రు.
అసలు వీళ్ళూ మనుషులేనా?.
సామాజిక విలువల్ని
మోస్తామంటూనే
దుర్మార్గపు పనులపైనే
ఆలోచనలన్నీ.
బీదరికం ఆకలి
అప్పులు పుట్టని అసహాయులే
వీరి లాభసాటి వ్యాపారాలకు
పర్మిట్లు
చట్టమా!
వీరి చుట్టూ ఉచ్చు బిగించు
మనుషులంటే
అమ్మకాలకు కాదనీ
నిరూపించు.

-ఏడెల్లి రాములు

## మైరావణులు

మత్తులకు బానిసలై
సొత్తులకు ఆశపడేవారు
విచ్చు కత్తులను గుచ్చి
విషనాగులవుతారు
అక్రమ సంతానాలకు
ఆలనా పాలనా కరువై
పెరిగి పెద్దయి సంఘం మీద
కక్షలు కార్పణ్యాలు పెంచుకుని
పెడత్రోవలు తొక్కుతారు
ఒక్క తప్పు జరుగుతున్నదంటే
సంఘంలో జరిగే
సవాలక్ష తప్పుల ఫలితమే
సడేమియా లాంటి పాలనా
విధానం
లంచగొండితనం
అన్యాయాలు అక్రమాలకూ
పుట్టిన సంతానమే
ఈ అక్రమ మానవ రవాణా.
వైద్యవృత్తిలో కొంతమంది
వైరస్ లలా చొరబడి
తెల్లవారేలోపల కోటీశ్వరులు
అవ్వాలని అడ్డదారులు.
కొంతమంది పోలీసులే
వత్తాసుగా నిలబడి
వంకర పనులను
వలాయించి చేయించడం.
నిరక్షరాస్యత, పేదరికం
ఆకలి
స్వీయ క్రమశిక్షణల లోపం
చట్టాలలో లొసుగులు
సవాలక్ష దొడ్డి దారులు
ఇప్పుడు కొత్తగా ప్రతీది
జిహాదీ అయి కూర్చుంది..
ఆ వంక కూడా
ప్రేమలోకి దింపి
మనుషులను మాయం
చేయడం.
అన్నింటికీ మూలం
అవగాహనా లోపం
పిల్లలను ఎత్తుకెళ్లి ముఠాలు.
పకడ్బందీ పన్నాగాలు
పారదర్శక పాలనలు
ప్రశిక్షణమైన పనివిధానం
పోలీసులలో
పకడ్బందీ చట్టాలుంటే
అరికట్టవచ్చు.

-నగునూరి రాజన్న

## నవీన రావణులు

సరకులనే కాదు
జంతువులనే కాదు
మానవ సరుకులను కూడా
వివిధ రవాణా మార్గాల్లో
తరలిస్తున్న దుస్థితి
మారాలి ఈ పరిస్థితి!!.
ఊబిలో దించేసి
మాయపు వలలో ముంచేసి
రవాణా చేస్తున్న మోసకార్లు
వాహనాల్లో విమానాల్లో
మోసుకెళుతున్న జీవసరుకులు
తరలిస్తున్న తీరుతెన్నులు
బలిఅవుతున్న సంసారాలు
గొర్రెల చందపు ఊసులు!!.
విదేశాల మోజులో
చిక్కుకున్న యువలోకం
ఉద్యోగాల నెపంతో
దొంగవీసా బారినపడి
రాక్షసత్వ నాటకంలో ఇరికించ
బతుకు దెరువు మురిపించ
బందీలై తనవారిని వదిలి
నలిగిపోతున్న వైనం.
చిన్నారులను మోసగించి
తరలిస్తున్న నరహంతకులు
కూలినాలి కోసమంటూ
విదేశాలకు వెళ్ళే
అమాయక జీవులు
నకిలిముఠా
మకిలిలో కూరుకుపోయిన
శ్రామిక సోదరులు.
ప్రేమ పేరుతో మోసగిస్తూ
సామాజిక మాధ్యమం
సాంకేతిక వ్యవహారం
నవీన కీచకుల మత్తులో పడి
జీవితాన్ని కోల్పోయిన
మగువలు
లైంగిక వేధింపులు
అక్రమ రవాణాలో బాధితులు.
వైద్యమే వికసించగా
వైద్యలోకం విస్తుపోవగా
వికటిస్తున్న జీవనశైలి
అవయవాల దోపిడీ
అక్రమ రవాణాకు ఊపిరి.
అప్రమత్తం లేకపోతే
అవస్థల పాలపడితే
గీత దాటిన సీతగతి
పుష్పకవిమానంలో రవాణా
వైచిత్రి
నేటి రావణుల మతి
రాముడేడి హనుమ ఏడి
సముద్రాలు దాటించగా
జీవితాలు నరకమే కదా!!.
సత్యంకోసం నాడు
హరిశ్చంద్ర చక్రవర్తి
ఆలుపిల్లలనమ్మ
స్వార్థంకోసం నేడు
తనను తనవాళ్లను
అమ్ముకుంటున్న వైనం
అక్రమార్కులకు వరం
రవాణాకు బలం!!.
ఆశల వీడి
ఆలోచనలు వాడి
సక్రమంగా
బతుకు దెరువు కొరకు
పాటుపడాలి
ఎవరి రక్షణ వారే చూసుకోవాలి
మాయమారీచుల వలలో
చిక్కకుండా కాపాడుకోవాలి!!.

-డా. చీదెళ్ళ సీతాలక్ష్మి

## బందీలు - రాబందులు!

అక్రమం అంటూ కెవ్వ్ కేకలు
సక్రమం ఏదంటూ పొలికేకలు
విలవిలలు గిలగిలలో వలలో
చిక్కిన చేపలు, చిలకలు
పెరుగుతున్న పైశాచికత్వం
కరుగుతున్న మానవత్వం
మరుగుతున్న గుండెలు
అక్రమ రవాణాలో జీవచ్ఛవాలు.
కలాలు గళాలు విన్నపాలు
వ్యథలు సొదలు నీటిపాలు
గోవులు మానవులను
బతికుండగానే
పీక్కుతినే రాబందులు
నలువైపులా బంద్ అయిన
ఇనుప తలుపులు.
ఆశ్రయం కల్పించినా
గోడదూకి పారిపోయిన
మైనర్ అమ్మాయిలు!
మాంత్రికుడి చేతిలో చిక్కిన
కీటకాలు
అవినీతి డబ్బుకై ఎగబడే
క్రూక్స్ చేతిలో దురాశతో క్రాక్స్.
లైంగిక దోపిడీ
వెట్టిచాకిరీ ఏటా
నలభైవేలమంది
బాలలు మాయం!.
యాచకులు, వ్యభిచారులు
గంపెడు సంతానం
అవగాహనారాహిత్యం
మాదకద్రవ్యాల సరఫరాలో
తీవ్ర వాదుల చేతిలో బలి.
జస్టిస్ వర్మ నివేదికలో
చట్టపరమైన శిక్షలున్నా
సమాజం ప్రభుత్వాల ఉదాసీనత
గొంగట్లో కూర్చుని.
అన్నం మెతుకులు తినే దేశాలు
పేదరికం ఆకలి పోవటం
అసాధ్యం
కంచే చేను మేసే కలికాలం
కలాలు గొంతు చించుకున్నా
చింపి కాగితాలు మంటపెట్టే
కుహనావాదులు!.
ఎవరిగోల వారిదే!
ఈ అంశానికి
ముగింపు లేదంతే.

-ఎ.రాజ్యశ్రీ

# ఇతర భాషల్లోకి అనువాదంతో మన ప్రతిభ విశ్వవ్యాప్తం



ది వాలియంట్ కళింగ పుస్తకావిష్కరణలో జస్టిస్ యతిరాజులు, డా॥ కె.వి.రమణాచారి, కూరపాటి వెంకటనారాయణ, హరిబాబు, తమ్మినేని, తంగిరాల శ్రీలత

హైదరాబాద్, ఆగష్టు 12:తెలుగు సాహిత్యం చరిత్ర ఇతర భాషల్లోకి అనువదించినపుడు విశ్వ వ్యాప్తంగా మన ప్రతిభ తెలుస్తుందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ బి. యతిరాజులు పేర్కొన్నారు. ఏపీ సాంస్కృతిక శాఖ పూర్వ సంచాలకుడు డా॥ డి. విజయభాస్కర్ రచించిన **'వీర కళింగ'** పుస్తకాన్ని డా॥టి. శ్రీలత ఆంగ్లంలోకి అనువదించిన **'ది వాలియంట్ కళింగ'** పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్ర భారతి సమావేశ మందిరంలో జరిగింది. ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి విశ్రాంత ఐఏఎస్ డా॥ కె.వి.రమణాచారికి అంకితం చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ యతిరాజులు మాట్లాడుతూ.. డి. విజయభాస్కర్ నాటక నవల కథా రచయితగా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. ఏపీ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. ఐదు వేల సంవత్సరాలు మహోన్నతమైన తెలుగు చరిత్రను, ఖ్యాతిని, చాటుకోవాల్సిన అవసరముందన్నారు. రసరంజని సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూరపాటి వెంకటనారాయణ, హరిబాబు, తమ్మినేని, తంగిరాల శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# సాహిత్య సుగంధం వెదజల్లిన ఖమ్మం

## ఘనంగా హాసిని రామచంద్ర సాహిత్య పురస్కారాలు

హైదరాబాద్, ఆగష్టు 12: ఈనెల 9న ఖమ్మం నగరంలోని



పురస్కార గ్రహీతలతో అతిథులు

వేదిక ఫంక్షన్ హాల్‌లో హాసిని రామచంద్ర లిటరరీ ఫౌండేషన్ (హెచ్‌ఆర్‌సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం సాహిత్య సుగంధాన్ని వెదజల్లింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కవులు, రచయితలు, సాహితీవేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రసేన్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు అతిథిలుగా సాహితీవేత్తలు ఆనందాచారి, సంధ్యారాణి, శ్రీరామ్ పుప్పాల హాజరయ్యారు.

ఈ సందర్భంగా హెచ్‌ఆర్‌సీ 2026 పురస్కారాల విజేతలను ప్రకటించి సన్మానించారు. సాహిత్య పురస్కారంను మైసూరు కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ (తెలుగు) బి. నాగశేషు అందు కున్నారు.

కవిత్వ సంపుటాల విభాగంలో ప్రథమ బహుమతి డాక్టర్ కాసుల లింగారెడ్డి రచించిన **ఒక ఆకు పచ్చ కల**కు లభించింది. ద్వితీయ బహుమతులు నాగజ్యోతి శేఖర్ రచించిన **చిగురించే పేజీలు,** సుధా మురళి రచించిన **తడి ఆరని వాక్యమొకటి** సంపుటాలకు ప్రదానం చేశారు.

తృతీయ బహుమతి మౌనశ్రీ మల్లిక్ రచించిన **మంటల స్నానం** కవితా సంపుటికి లభించింది. ప్రత్యేక బహుమతి కళ్యాణి కుంజ రచించిన **కంకపొదకు** అందజేశారు.

కథల విభాగంలో ప్రథమ బహుమతి సింగరాజు శ్రీనివాస రావు రచించిన వివేకం నిద్రలేచి ంది కథకు దక్కగా, ద్వితీయ బహుమతి సంధ్య బోనాల రచించిన కొండచరియలు, తృతీయ బహుమతి కామనూరు రామ్మోహన్ రచించిన కొంగల మద్రి కథలకు లభించాయి. కన్సోలేషన్ బహుమతి కపిల రాంకుమార్ రచించిన పక్షులు మళ్లీ వస్తాయి కథకు ప్రదానం చేశారు.

సాహిత్య రంగంలో నిరంతరం కృషి చేస్తున్న రచయితలను గౌరవించడం ద్వారా సృజనాత్మ కతకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని, ఇలాంటి సాహిత్య వేదికలు యువ రచయితలకు స్ఫూర్తినిస్తాయని వక్తలు పేర్కొన్నా రు. సాహిత్య సేవను మరింత విస్తరించేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపుని చ్చారు.

కార్యక్రమంలో సీతారాం, శ్రీనివాస్ సూఫీ, దాసరోజు శ్రీనివాస్, ఇబ్రహీం నిర్గున్, వంశీ కృష్ణ, రాచమల్ల ఉపేందర్, వంశీకృష్ణ, జయశ్రీ మువ్వా, సిహెచ్ ఆంజనేయులు హాజరయ్యారు.

# ఆలోచింపజేసే నవల చదువుల చిలకమ్మ -సాదనాల వెంకట స్వామి నాయుడు

హైదరాబాద్, ఆగష్టు 12:చదువుల చిలకమ్మ నేటి విద్యా వ్యవస్థకు అవసరమైన నవలయని,అందరిని ఆలోచింపజేసి,ఒక తరాన్ని మార్చగలిగే అక్షర రూపమని ప్రముఖ కవి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ నంది పురస్కార గ్రహీత సాదనాల వెంకట స్వామి నాయుడు అన్నారు.భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన కరీంనగర్ లోని ఫిలిమ్ భవన్ లో సోమవారం రోజున జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరై కోట లక్ష్మణ్ రచించిన చదువుల చిలకమ్మ నవలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన




మాట్లాడుతూ పేరు కోసం ప్రాకులాడే కవులున్న ఈ కాలంలో కోట లక్ష్మణ్ కొత్తకోణంలో చక్కని అంశంపై నవల రాయడం అంత సులభమైన విషయం కాదని అన్నారు.ప్రతి పాఠశాలలో ఆదర్శ భావాలు కలిగిన ఉపాధ్యాయులుంటె సమాజం పురోగమిస్తుందన్నారు.ఆత్మీయ అతిథిగా హాజరైన సాహితీ గౌతమి అధ్యక్షులు నంది శ్రీనివాస్ మాట్లాడుతూ కృత్యాధార బోధనను వైవిధ్యంగా ఈ పుస్తకంలో పరిచయం చేయడం ద్వారా పాఠశాలల్లో ఒక విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టారని అన్నారు.ఈ పుస్తకం ప్రతి పాఠశాలలో ఉండదగినదని అన్నారు.గౌరవ అతిథిగా హాజరైన ఉదయ సాహితి అధ్యక్షులు ఎర్రం రాజారెడ్డి మాట్లాడుతూ ఒత్తిడి లేని విద్యను పిల్లలకు అందించాలని, స్వేచ్ఛా వాతావరణంలో అభ్యసనం సులువుగా జరుగుతుందని అన్నారు.ప్రధాన వక్త స్తంభంకాడి గంగాధర్ పుస్తకాన్ని పరిచయం చేస్తూ ఈ నవల కొన్ని ప్రత్యేక లక్షణాలు కలిగి ఉందని,27 చాప్టర్లతో కూడిన నవలలో పది మంది పిల్లలతో మూతపడిపోతున్న ఒక పాఠశాలను తన కృషితో 112 మంది పిల్లలు గల బడిగా తీర్చి దిద్దిన విధానం,పాఠశాలను సమాజంతో మమేకం చేసిన విధానం,ఎదుర్కొన్న సవాళ్ళు,అధిగమిస్తు సాగిన అనన్య టీచర్ పయనాన్ని చక్కగా వివరించారని, ఆగకుండా చదివించే లక్షణం కలిగిన నవల చదువుల చిలకమ్మ అని అన్నారు.కార్యక్రమంలో కోట లక్ష్మణ్ తను రాసిన చదువుల చిలకమ్మ పుస్తకాన్ని తన తొలి గురువైన వెంకట రంగయ్య గారికి అంకితం చేసి వారి ఆశీర్వాదాన్ని పొందారు. కార్యక్రమంలో నడిమెట్ల రామయ్య, అన్నమరాజు శ్రీధర్ రావు, కాసం రాజమౌళి, వెల్మల జయపాల్ రెడ్డి, సిహెచ్ రమేష్, సంగోజు శ్రీనివాస్, కనపర్తి రాజశేఖర్, రాము ఇటిక్యాల్, కోడూరి రవి, కసిరెడ్డి జలంధర్ రెడ్డి, జనగాని యుగంధర్, బి శ్రీనివాస్, ఎం సాంబమూర్తి ,మాసం సీమ, దామరకుంట శంకరయ్య, ఎస్ సంపత్ కుమార్, తిరుకోవెల వెంకటరమణ, రేవెల్లి తిరుపతి, గూడెపు కుమార్, లావుడ్యా రమేష్, అనిల్ కుమార్ రెడ్డి, బి. శ్రీకర్, ఎం సుగుణ,పి. సత్యనారాయణ రాజు,బొమ్మ కంటి కిషన్, జి. రాజమల్లయ్య, చిమ్మని చంద్రశేఖర్, విలాసాగరం రవీందర్, గంగుల శ్రీకర్, గుండు రమణయ్య, ఏం జయకృష్ణ, యండి ఖాలిద్ లు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో హర్ ఘర్ తిరంగా భారీ ర్యాలీ

**-300 మీటర్ల జాతీయ జెండాతో ప్రదర్శన..**
**-జాతీయతా భావం పెంపొందించడమే లక్ష్యం: కీర్తిరెడ్డి**

వరంగల్, ఆగష్టు 12:79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై సుమారు 300 మీటర్ల పొడవైన జాతీయ జెండాను ప్రదర్శిస్తూ దేశభక్తిని చాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, పట్టణ ప్రముఖులు, మేధావులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో జాతీయతా భావాన్ని పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఉద్దేశమని అన్నారు. మనమంతా భారతీయులమనే భావనతో దేశంపై విశ్వాసాన్ని పెంచుకోవాలని సూచించారు. జాతీయ జెండా కింద ప్రజలంతా ఐక్యంగా ఉంటే దేశాన్ని ఏ శక్తీ ఓడించలేదన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పోస్టాఫీసుల ద్వారా జాతీయ జెండాలను అందుబాటులోకి తెచ్చిందని, గ్రామాల్లో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రతి ఇంటికీ జెండాలు అందించి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎగురవేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కన్నం యుగంధర్, ఎరుకల గణపతి, జిల్లా అధ్యక్షుడు నిశిదర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, మేధావులు పాల్గొన్నారు.


రాచకొండ విశ్వనాథ శాస్త్రి
రంగులూ, ఫిరంగులూ
సంకలనం : ఏ.వి. రమణమూర్తి
పుస్తక పరిచయ సభ
సభాధ్యక్షత
నారాయణ వేణు మిత్రసాహితి
గౌరవ అతిధులు
డాక్టర్ వేమూరి కృష్ణమూర్తి
రాచకొండ ఉమాకుమార శాస్త్రి
పుస్తక పరిచయం
జి.ఎస్. చలం
సంకలనకర్త స్పందన
ఏ.వి. రమణమూర్తి



అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం
డాబా గార్డెన్స్
విశాఖపట్నం
16.8.2026
ఆదివారం
ఉదయం
10.00 నుండి
1.00 వరకు
అందరూ ఆహ్వానితులే
నిర్వహణ
మిత్ర సాహితి
విశాఖపట్నం




నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

-సంపాదకులు

## వందన సమర్పణ

మాట మంత్రదండమై చూపులన్నిటినీ
ఆకర్షించే సూదంటురాయి
వాక్సాగరాన్ని చిలికి సింధువును బిందువులో
బంధించే కవ్వపుతాడు
స్వరం సన్నాయి రాగమై కదిలిన కాలిని నిలిపేసే గురుత్వాకర్షణశక్తి
ధన్యవాదాలకు పరిమితంకాని చిట్టా
శ్రోతలను మంత్రముగ్ధం చేసి చివరికంటా నిలబెట్టే
పొందికైన ప్రసంగకళ
సభకు ముగింపు వాక్యం కాదు
సభికుల హృదయాల్లో నిండిన అనుభూతి పరిమళం
భావానికి భాషతోడై ప్రతిభకు సలిపే ఘనసన్మానం
తడబాటుకు తావీయని స్పష్టత
అసహనానికి సందీయని సంక్షిప్తతలతో
విద్వత్తుకు చేసే వినమ్ర నమస్కారం
తలలో మెదిలిన తలపులను పదాలతో జతకూర్చి
సభాస్థలిపై పాడే మంగళగీతం
మరలిన తలలన్నీ పొద్దుతిరుగుడు పూలై సభా సరస్వతికి
సమర్పించే పుష్పాంజలి

-పద్మశ్రీ చెన్నోజ్వల

## ప్రశ్నించే హక్కుంటది

పిడికిలెత్తి జై కొట్టు
న్యాయం ధర్మముకై
పోరాట జండ నెత్తి బట్టు
పేదోని పక్షమై
పీడనలను ఎదిరించు
దోపిడీలను ప్రతిఘటించు
మోసాలను బయటపెట్టి
జనులను చైతన్య పరుచు .
పచ్చ నోటు కాశపడి
ప్రజాస్వామ్యాన్ని అమ్ముకోకు
అధికారాన్ని కట్టబెడితే
ఐదేండ్ల ఏలుబడిలో
కబ్జా చేసిన భూములెన్నో
కూడగట్టిన ఆస్తులెన్నో
సర్కారు అంటే నీ ఓటేనని
గుర్తించు .
గొప్ప గొప్ప చదువులు
చదివినమని చెప్పుతారు
కళ్ళముందే అన్యాయం
జరుగుతుంటే చూస్తారు
తన దాకరాలేదని
నాకెందుకులే అనుకుంటరు.
చదువంటే సంపాదన
ఒక్కటే కాదయ్యా
మౌనమే నీ భాష
అనుకోకువారయ్య
నేనొక్కడినే ఓటయ్యకుంటే
ఒరిగేదేముంటదని
ఎవరికి వారు అనుకుంటే
ప్రజాస్వామ్యం నిలబడదు.
పక్షం ప్రతిపక్షం మంటు
శత్రువులు ఉండబోరు
నిన్న నన్ను ఉసిగొల్పే
కనికట్టు తాంత్రికులు
నోట్లతో బేరమాడి
ఉచ్చులు అల్లుతారు
వెలకట్టలేనిది అమూల్యమైనది
ఓటేస్తే విలుఉంటది
ప్రశ్నిచే హక్కుంటది.

-యరకల యాదయ్య
9866468979.

## స్నేహం

స్నేహం బాధలో ఉన్నప్పుడు
భుజంపై వాలి ఓదార్చే
సంతోషపు సీతాకోక చిలుక
కష్టాల్లో ఉన్నప్పుడు
సహాయపు నిచ్చనేసి ఓదార్పునిచ్చే ఇంకో అమ్మ ఒడి
రెక్కలు లేని ఒంటరి పక్షైనప్పుడు
తోడినిచ్చి నీ వెంటే ఉండే నీడ
చేయ్యందించే మరో నాన్నా
కన్నీటి సముద్రంలో ఈతరాని చేపలా కొట్టుకుపోయేటప్పుడు
అడగక ముందే ఆనందపు పడవ అందించి
కాపాడే కనిపించే దైవం
నిరుత్సాహం నీ మనసులో మేలుకొనప్పుడల్లా
ఉత్సాహపు గాలితో దాన్ని నిద్రపుచ్చే మాను
జీవితంలో ముళ్ళ దారులు ఎదురైనప్పుడల్లా
పువ్వుల వర్షం కురిపించే మేఘం
మంచి స్నేహం ఎప్పటికీ వాడిపోని పువ్వు
ఆకాశంలోని అక్షర నక్షత్రంత్రాలను
జతకట్టినా వర్ణించలేని గొప్ప బంధం ఈ స్నేహం

- పి.భవ్య శ్రీ

## కలికాలపు తీరు

సీ.
కలికాల మహిమేమొ కాలమ్ము మారెనే
  మానవత్వమ్మును చేజారి మంటగలిసె
పేగు బంధాలన్ని పెడదోవ ద్రొక్కెనే
  పెద్దరికములన్ని పెంట గలిసె
రక్త సంబంధాల లక్షణమ్ములు మారి
  ధనము చేతనవియె దారి దప్పె
వృద్ధాప్య జీవనం వేధింపబడుచుండె
  దాంపత్య బంధాలు దయను దప్పె
తేగీ.
కన్న వారంత మారిరి కలియుగాన
కన్న ప్రేమలు కలిసెన కాటిలోన
బ్రతుకు దారిలో బాధ్యత పాటితప్పె
ధర్మమే రీతి నిలుచునో ధరణి పైన.
సీ.
తల్లి సొమ్ములకును తగవులాడుదురును
  బాధ్యతలను వారు పంచుకోరు
కొడుకులు కోడండ్లు కొట్లాడుకుందురే
  అత్తమామల జూడరలుకతోను
పిల్లలు వినలేరు తల్లిదండ్రుల మాట
  చిన్న పెద్ద యనక తన్నుకొనుచు
తల్లి చెల్లె యనక తప్పుడు పనులను
  చేయజూతురిలన చిన్నవారె
ఆ.వె.
గొప్ప కొరకు పోయి తప్పులు జేతురు
ముప్పు గలుగుననియు ముందు గనరు
మాట వినక నుండి మర్ల వడగజూచు
మానవతను మరిచు మంచి లేక

-నర్సింగోజు లక్ష్మయ్య

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.